


నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

అమలాపురం టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు శనివారం జిల్లావ్యాప్తంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లుచేశామని డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని 2,37,244 మంది పెన్షన్‌దారులకు రూ.100.55 కోట్ల మేర పెన్షన్ల నగదు పంపిణీ చేస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కొత్తగా స్పౌజ్ పెన్షన్ల పంపిణీ తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు ఉత్తర్వులు అందాయి.

అసలేం జరిగింది ?

తణుకు రూరల్ ఎస్ఐ మూర్తి మరణంపై భిన్న వాదనలు

- మూర్తి స్వగ్రామం కోనసీమలోని కే గంగవరం
- ఆత్మహత్య చేసుకున్నాడు : బంధువులు
- రివాల్వర్ మిస్ ఫైర్ : ఎస్పీ నయీం



పశ్చిమగోదావరి జిల్లా తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌లో రివాల్వర్‌తో ప్రాణం కోల్పోయిన మూర్తిది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కే గంగవరం. ఆయన మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. - 7లో

మండపేటలో రూ.30 కోట్లకు టోకరా?

- అటు భక్తిమార్గం.. ఇటు వడ్డీ వ్యాపారం
- అధిక వడ్డీ ఆశతో భారీగా అప్పులిచ్చిన మహిళా భక్తులు
- బోర్డు తిప్పేయడంతో బాధితులు లబోదిబో

7

కరప సొసైటీ ఇన్‌చార్జ్ సీఈవో ఆత్మహత్య

7





3వ వార్డులో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది.. వార్డులో డ్రైన్ శుభ్రం చేస్తున్న దృశ్యం

కదిలిన యంత్రాంగం



అమలాపురం టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' అమలాపురం 3వ వార్డులో నిర్వహించిన చర్చా వేదికలో ప్రస్తావించిన సమస్యలపై అధికార యంత్రాంగం స్పందించింది. ఇందులో కొందరు దోమల బెడదను పలువురు ప్రస్తావించడంతో కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది డ్రైన్లలో చెత్తాచెదారం తొలగించడంతోపాటు దోమల మందును స్ప్రే చేశారు. ఎక్కడా చెత్తాచెదారం నిల్వ ఉండకుండా ప్రత్యేక వాహనాలపై కంపోస్టు యార్డుకు తరలించే పనులు చేపట్టారు. లోఓల్టేజీ సమస్యపై విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందించి వాటిని పరిశీలన చేస్తున్నట్టు వార్డు కౌన్సిలర్ యేడిద శ్రీను తెలిపారు. కొండల్లా ఉన్న స్పీడ్ బ్రేకర్ల సమస్యను మరో రెండు రోజుల్లో పరిష్కరించనున్నట్టు తెలిపారు. గత రెండు రోజులుగా దోమల నివారణలో భాగంగా ఫాగింగ్ చేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు.





డ్రైన్‌లో దోమల మందు స్ప్రే చేస్తున్న దృశ్యం.. రోడ్ల మీద చెత్త తొలగిస్తున్న పారిశుధ్య పనివారలు

గ్రహణం వీడేనా..

- బడ్జెట్‌లో నిధులు కేటాయించినా.. పనుల్లో పురోగతి ఏది?
- నిధుల కేటాయింపుపై ఆసక్తిగా ఎదురు చూస్తున్న కోనసీమ వాసులు
- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కేంద్రంలో తొలి పూర్తి బడ్జెట్ నేడు



వైనతేయ నదిపై పిల్లర్ల స్థాయిలో నిలిచిన వారధి.. కోటిపల్లిలో నిలిచిన రైల్వేలైన్ నిర్మాణ పనులు





నిలిచిన కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణ పనులు



చించినాడ వద్ద నిలిచిన రైల్వేలైన్ పనులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కేంద్రంలో ఎన్డీఏ కూటమి మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా పూర్తిస్థాయిలో ప్రవేశపెడుతున్న కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రైల్వేశాఖకు నిధుల కేటాయింపుపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దశాబ్దాలకాలం నుంచి ఈ ప్రాంత ప్రజల చిరకాలవాంఛగా ఉన్న కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణ పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయి. గత ఏడాదిలో సుమారు రూ.300 కోట్లు ఈ ప్రాజెక్టు కోసం కేటాయించినట్టు ప్రచారం జరిగినప్పటికీ ఏడాదికాలంలో రైల్వే ప్రాజెక్టు పనుల్లో ప్రగతి మాత్రం శూన్యమే. నిధుల కేటాయింపు చూపుతున్నా వాటి వినియోగంలో ఏర్పడుతున్న ప్రతిష్టంభన తొలగించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం చొరవ చూపాల్సి ఉందని కోనసీమవాసుల డిమాండ్. దివంగత నేత జీఎంసీ బాలయోగి తనయుడు గంటి హరీష్‌మాధుర్ తొలిసారిగా పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన నేపథ్యంలో ఈసారి రైల్వే ప్రాజెక్టుకు బడ్జెట్టులో నిధుల కేటాయింపు చేయడంతోపాటు రైల్వే ప్రాజెక్టు పనులు పట్టాలెక్కిస్తారని ప్రజలంతా భావిస్తున్నారు.

ఏళ్ల తరబడి పనులు సాగుతు

న్నప్పటికీ గత ఐదేళ్ల కాలంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం అసలు పట్టించుకోకపోవడం వల్ల ప్రాజెక్టు పనులకు బ్రేక్ పడింది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కోసం ఎన్డీఏ కూటమి పార్లమెంటు సభ్యులు రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిసి తమ ప్రాంత ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని ఇప్పటికే అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో శనివారం పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కోసం ముఖ్యంగా రైల్వే కేటాయింపుల కోసం కోనసీమవాసులు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. కాగా కోటిపల్లి-నర్సాపురం మధ్య బ్రాడ్‌గేజ్ రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా గౌతమీనదిపై శానపల్లిలంక-కోటిపల్లి మధ్య భారీ రైల్వే వంతెన పిల్లర్స్ పనులు పూర్తయ్యాయి. అదేవిధంగా వైనతేయ నదిపై పాశర్లపూడి- బోడసకుర్రు మధ్య, వశిష్ఠపై చించినాడ-నర్సాపురం మధ్య రైల్వే వంతెన పనులు కొనసాగుతున్నాయి. మూడు నదీపాయలపై నిర్మితమవుతున్న వారధులు పిల్లర్స్ స్థాయిలో పూర్తి కావస్తున్నప్పటికీ వాటిపై గడ్డర్స్ ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే రైల్వేలైన్ నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ దృష్టిపెట్టి అధికారులతో ఇటీవల సమీక్ష చేశారు. అలాగే ఇటీవల అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్‌మాధుర్ సైతం కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసి ప్రాజెక్టు పనులు కొన సాగేలా చూడాలని కోరడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతు వాటాను విడుదల చేసి అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఆర్థికమంత్రి చేసే ప్రకటన కోసం కోనసీమ ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

3న పట్టభద్రుల ఎమ్మెల్సీ నోటిఫికేషన్

కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణ : డీఆర్వో రాజకుమారి

అమలాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ అవుతుందని జిల్లా రెవెన్యూ అధికారిణి బీఎల్ఎన్ రాజకుమారి తెలిపారు. శాసన మండలి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు పూర్తిగా సహకరించాలని ఆమె కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికల విధివిధానాలను ఆమె వివరించారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లను స్వీకరిస్తారన్నారు. ఫిబ్రవరి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. ఇప్పటివరకు 64,327 మంది పట్టభద్రులు జిల్లాలో ఓటర్లుగా నమోదయ్యారని, వారిలో పురుషులు 37,069 మందికాగా మహిళలు 27,256 మంది, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు ఉన్నారు. ఓటింగ్ ప్రక్రియ నిర్వహణ కోసం జిల్లాలో 95 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. ప్రధానంగా అమలాపురంలో 10, ఆలమూరు మండలంలో 3, మండపేట 8, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లో మూడేసి పోలింగ్ కేంద్రాలు, రాయవరం 2, రామచంద్రపురం 7, రావులపాలెం 5, ఐ.పోలవరం, పి.గన్నవరం, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో నాలుగేసి పోలింగ్ కేంద్రాలు ముమ్మిడివరం5, అయినవిల్లి 3, కొత్తపేట 6, అంబాజీపేట 3, మామిడికుదురు 4, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల్లో మూడేసి పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. సమావేశంలో వడ్డి నాగేశ్వరరావు (కాంగ్రెస్), కారెం వెంకటేశ్వరరావు(సీపీఎం), యాళ్ల నాగసతీష్, కె.నాగమానస(జనసేన), దూరి రాజేష్(బీజేపీ)తో పాటు సూపరింటెండెంట్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పునఃప్రారంభించాలి : కలెక్టర్



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జొన్నాడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో వారం రోజుల్లో పునఃప్రారంభించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాంట్రాక్టర్లు, ఇంజనీర్లతో కలెక్టర్ అధ్యక్షతన ఫ్లైఓవర్ పనుల పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ కారణాలతో నిలిచిపోయిన నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఇప్పటికే జాప్యాలు ఎదురయ్యాయని, వాటిని అధిగమించి పురోగతిచూపాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమైన మట్టిని సమకూరుస్తామన్నారు. శాస్త్రీయంగా పరిశోధన చేసి ఏ ప్రాంతంలో మట్టి నిర్మాణానికి అనువుగా ఉంటుందో నిర్ధారించుకోవాలన్నారు. స్ట్రక్చర్ల నిర్మాణం తదితర పనుల్లో పురోగతిని సాధించాలన్నారు. 14, 15 తేదీల్లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పరిశీలిస్తామన్నారు. రావులపాలెంలో నిత్యం ఉండే ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు వీలుగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధంచేయాలన్నారు. భూ సేకరణ తదితర అంశాలపై జాతీయ రహదారుల ఇంజనీర్లు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా పథకం సంచాలకులు డి.సురేంద్రనాథ్, సృష్టి కాంట్రాక్టు ప్రాజెక్టు మేనేజర్ ఎస్.రామకృష్ణ, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లోపభూయిష్టంగా సంక్షేమ వసతి గృహాల సర్వే నివేదిక



అమలాపురం టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వసతిగృహ అధికారులతో చేపట్టిన సర్వే నివేదికలు లోప భూయిష్టంగా ఉన్నాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండేలా నవీకరణకోసం విద్యార్థుల ప్రాతిపదికన సర్వే ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు, సంక్షేమ వసతిగృహ అధికారులతో చేపట్టిన సర్వే నివేదికల్లో స్పష్టత కొరవడిందన్నారు. మరోసారి వసతిగృహాలను సందర్శించి కాంపోనెంట్లు, విద్యార్థుల దామాషా ప్రకారం అంచనాలు రూపొందించి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసిన అనంతరం కార్యాచరణను రూపొందిస్తూ టెండర్లు పిలిచి ఆయా పనులను పూర్తిచేస్తామన్నారు. ఈ సమావేశంలో విద్యాసంక్షేమశాఖ డివిజనల్ ఇంజనీర్ సుబ్బరాజు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం : డీపీవో

కె.గంగవరం, జనవరి31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పారిశుద్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతాలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె కె.గంగవరం పంచాయతీలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా తనను కలసిన విలేకరులతో మాట్లాడారు. మార్చి 31 నాటికి జిల్లాలో 385 గ్రామాల్లో చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురానున్నట్టు చెప్పారు. ఇప్పటికే 268 నిర్మాణాలు పూర్తికాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వీటిని మార్చి 31లోగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్ కోసం ఉమా ఇండస్ట్రీస్‌తో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఆ కంపెనీ వారు కిలోకి రూ.7 చెల్లించి తీసుకుని వెళతారన్నారు.

స్థల వివాదంలో పొలిటికల్ ఫైర్

- వరుసకు సోదరుల గొడవ
- మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో రగడ
- పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం
- 191 మందిపై కేసు నమోదు
- పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు మరో కేసు నమోదు





లక్ష్మీపోలవరం పరిధిలో రావులపాలెం హైవేలో ఉన్న వివాదానికి కారణమైన స్థలంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులను అడ్డుకుంటున్న అనుచరులు

రావులపాలెం, జనవరి31(ఆంధ్రజ్యోతి): ఇద్దరి అన్నదమ్ముల మధ్య తలెత్తిన భూవివాదం రగడ మారి, రాజకీయరంగు పులుముకోవడంతో ఘర్షణ చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. రావులపాలెం మండలం రావులపాడు జాతీయ రహదారి చెంతనే లక్ష్మీపోలవరం రెవెన్యూ పరిధిలో సర్వే నెం185/4ఏలో 0.86 సెంట్లు భూమికి సంబంధించి వరుసకు సోదరులైన మల్లిడి సత్తిరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి మధ్య గతం నుంచి వివాదం తలెత్తి కోర్టుకు వెళ్లింది. ఈ స్థలంలో మల్లిడి శ్రీనివాసరెడ్డి కర్రల అడితి పెట్టుకుని వ్యాపారం సాగిస్తున్నాడు. కాగా మల్లిడి సత్తిరెడ్డి ఈ స్థలానికి సంబంధించి తమకు హక్కులు ఉన్నాయంటూ ఆయనకు చెందిన కొంతమంది ఈ స్థలంలో ఉన్న కర్రలు, బయటకు తరలించి టెంట్లు వేశారు. వైసీపీలో ఉన్న మల్లిడి శ్రీనివాసరెడ్డి తమ మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, వైసీపీ నాయకులతో కలసి శుక్రవారం వివాద స్థలంలోకి చేరుకున్నారు. అప్పటికే సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో భారీ మోహరించిన పోలీసులు వారిని అడ్డుకోవడంతో పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. వైసీపీ నాయకులు అక్కడ వేసిన టెంట్లు పీకేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి రావులపాలెం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ జగ్గిరెడ్డి మాట్లాడుతూ మునుపెన్నడూ లేనివిధంగా ఈ ప్రాంతంలో మండపేట నుంచి స్థానికేతరులు వచ్చి రౌడీయుజం చేసి స్థలాలు ఆక్రమించుకుంటుంటే అడ్డుకోవాల్సిన పోలీసులు కాపలా కాయడం సిగ్గుచేటన్నారు. ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉందని, తీర్పు ఎవరికి అనుకూలంగా వచ్చిన గౌరవించాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. కాగా దీనిపై వాస్తవాలు తెలుసుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానని డీఎస్పీ హామీ ఇవ్వడంతో జగ్గిరెడ్డి, గొల్లపల్లి, వైసీపీ నాయకులు అక్కడ నుంచి బయటకు వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ విద్యాసాగర్ పర్యవేక్షించారు.

అక్రమంగా ప్రవేశించారు..

తన స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి తమకు సంబంధించిన వస్తువులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీకి చెందిన రావులపాలెం వాసి మల్లిడి సత్తిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు ప్రకారం.. రావులపాలెం మండలం రావులపాడు జాతీయ రహదారి చెంతనే ఉన్న లక్ష్మీపోలవరం రెవెన్యూకు చెందిన 0.86 సెంట్ల భూమి నా స్వాధీనంలో ఉంది. మల్లిడి శ్రీనివాసరెడ్డి నకిలీ పత్రాలు సృష్టించి స్వాధీనపర్చుకోవాలని చూశాడన్నారు. దీంతో జిల్లా రెవెన్యూ అధికారికి తన భూమికి సంబంధించిన పత్రాలతో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీంతో విచారించి శ్రీనివాసరెడ్డి చూపిన నకిలీ పత్రాలను రద్దుచేసి తన పేరున పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని గతంలోనే ఉత్తర్వులు ఇచ్చారన్నారు. దీనిపై ఆగ్రహించిన శ్రీనివాసరెడ్డి తన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని, శుక్రవారం తన స్థలంలో మనుషులతో పనులు చేస్తుండగా మల్లిడి శ్రీనివాసరెడ్డి, మల్లిడి తరుణ్‌రెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, జవ్వాది రవి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావులతోపాటు మొత్తం 191 మంది అక్రమంగా స్థలంలోకి ప్రవేశించి టెంట్లు, కుర్చీలు, సరిహద్దు రాళ్లు ధ్వంసం చేసి సుమారు రూ.1.20 లక్షల ఆస్తినష్టం చేశారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మల్లిడి సత్తిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

ఏఎస్ఐ ఫిర్యాదు మేరకు మరో కేసు

రావులపాలెం మండలం రావులపాడు జాతీయ రహదారి చెంతనే ఉన్న స్థలంలో వివాదం తలెత్తి గొడవలు జరుగుతాయన్న ముందస్తు సమాచారంతో సిబ్బందితో పోలీసులు మోహరించారు. ఆ సమయంలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సుమారు 200 మందితో పోలీసుల విధులు ఆటంకం కలిగించి అక్కడ స్థలంలోకి ప్రవేశించి టెంట్లు, కుర్చీలు ధ్వంసం చేశారు. దీనిపై ఏఎస్ఐ పి.వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శేఖర్‌బాబు తెలిపారు.



వాడపల్లిలో డ్రాగన్ ఫ్రూట్



» ఇసుక, మట్టి నేలల్లోనూ సాగు » లాభాలు ఆర్జిస్తున్న రైతులు

ఆత్రేయపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చైనాలో పండే డ్రాగన్ ఫ్రూట్స్ పచ్చని కోనసీమలో రైతులకు కాసుల పంట పండిస్తోంది. ఉభయ గోదావరి జిల్లాల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. గత కొన్నేళ్లుగా డ్రాగన్ ఫ్రూట్‌ను ప్రజలు బాగా వినియోగిస్తున్నారు. ఇది ఆరోగ్యప్రదాయిని కావడంతో ఎంత ధరైనా పెట్టి కొనుక్కుని ఎంతో ఇష్టంగా తింటున్నారు. ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని ఇసుక, మట్టి నేలల్లో ఈ పంట బాగా పండడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 28వేల ఎకరాల్లో రైతులు ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. వాడపల్లికి చెందిన యేపుగంటి సతీష్ 1.50 సెంట్లలో ప్రయోగాత్మకంగా డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నాడు. ఉద్యానవన పంటలకు ప్రకృతి విపత్తులతో నష్టాలు ఎదురవుతున్నాయి. అయితే డ్రాగన్ ఫ్రూట్ పంటకు విపత్తుల నుంచి ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో మిగిలిన రైతులు కూడా ఈ పంటను పండించేందుకు సమయాత్తమవుతున్నారు. ఎకరాకు రూ.8 లక్షలు ఖర్చు అవుతుంది. ఏడాదిన్నరలోగా పంట చేతికొస్తుంది. సుమారు ఆరేళ్ల పాటు ఫ్రూట్స్ కాస్తాయి. రైతులు తోటలో కిలో రూ.120 నుంచి రూ.150 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. వేసవిలో డ్రాగన్ ఫ్రూట్ పంటకు ఉష్ణోగ్రత చల్లగా ఉండాలి. పంట తడిసేలా డ్రిప్ సౌకర్యం కల్పించాలి. డ్రిప్ ఇరిగేషన్‌కు రాయితీలను అందిస్తున్నారు.



దిగుబడి అధికం

యేపుగంటి సతీష్, రైతు, వాడపల్లి

ఎకరంన్నర పొలంలో డ్రాగన్ ఫ్రూట్ పండించాం. రూ.8 లక్షల వరకు పెట్టుబడి పెట్టాం. పంట దిగుబడి ఆశాజనకంగానే ఉంది. ఆదాయం కూడా బాగుంది. మరింత మంది రైతులు ఈ పంట సాగుకు ముందుకు వస్తున్నారు.



వాడపల్లి తోటలో రైతులు పండించిన డ్రాగన్ ఫ్రూట్స్

డ్రిప్, పైపులకు 90 శాతం రాయితీ

జి.కోటేశ్వరరావు, ఉద్యానవన శాఖాధికారి, కొత్తపేట



డ్రాగన్ ఫ్రూట్ పంట ఎండ వేడి నుంచి తట్టుకునేందుకు ఉష్ణోగ్రత చల్లగా ఉండాలి. ఈ సాగు చేపట్టే రైతులకు డ్రిప్, పైపు, స్తంభాలకు ప్రభుత్వం 90 శాతం రాయితీ అంటే సుమారు రూ.3లక్షలు అందిస్తుంది. దీంతో సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత నరేష్‌బాబు

హరిహరసదన్ కాటేజీకి రూ.5 లక్షలు విరాళం

అన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన హరిహర సదన్ కాటేజీకి శుక్రవారం సికింద్రాబాద్‌కు చెందిన చేకొండ నరేష్‌బాబు, విజయ, కుటుంబసభ్యులు రూ.5 లక్షలు విరాళాన్ని ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఈవో అభినందించి స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి, ప్రసాదాలు అందజేశారు. సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన సీహెచ్.విఘ్నేశ్వరరావు రూ.1.80 లక్షలు విరాళం అందజేశారు.




హోమ పూర్ణాహుతిలో పాల్గొన్న ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీ హోమం

అన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణ, మూలమంత్ర జపాలు పఠించారు. పదకొండు గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను మంత్రపూర్వకంగా అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ప్రస్తుతం ఏలూరు జిల్లాలో ఉన్న కుక్కునూరు సమీపంలో నాడు గోదావరిపై జలమార్గ సాధ్యాసాధ్యాలపై సర్వే చేస్తున్న దృశ్యం (పాత చిత్రం)



సర్వేతోనే సరి

గో...దారేదీ!

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

జాతీయ జలమార్గం సర్వేతోనే సరిపెట్టుకుంది. సరిగ్గా పన్నెండేళ్ల క్రితం పడ్డ అడుగులు అక్కడే ఆగిపోయాయి. ఆ మేరకు చేపట్టిన సర్వే వ్యయం రూ.కోటి వృథా అయ్యింది. గోదావరిపై జల మార్గానికి 2013లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రోడ్డు మార్గానికి ప్రత్యామ్నాయంగా జలమార్గ వినియోగం లాభదాయకమని భావించింది. ప్రధానంగా సరుకు రవాణా సులభతరమవడం, వ్యయ భారం తగ్గడం, రోడ్లపై ట్రాఫిక్ రద్దీ నియంత్రణ కూడా సాధ్యమేనన్న ఆలోచనే ఈ నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వయా వెలేరుపాడు, కుక్కునూరు, వరరామచంద్రపురం మధ్య ఉన్న 171 కి.మీ., భద్రాచలం నుంచి నాసిక్ వరకు ఉన్న 1,184 కి.మీ. నదీ జలాలపై సర్వే కూడా పూర్తయింది. అదే దశలో గోదావరి ఏలూరు కెనాల్ (రాజమహేంద్రవరం నుంచి ఏలూరు) 74 కి.మీ., కృష్ణా ఏలూరు కెనాల్ (ఏలూరు నుంచి విజయవాడ వరకు) 65 కి.మీ., మేర జల రవాణాను సుగమం చేయాలని నాడు భావించారు. సర్వే తంతుని ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడం.... ఆపై కేవలం నెలలోనే సర్వే పూర్తిచేయడం చకచకా జరిగిపోయింది. సర్వేలో గోదావరి లోతు, అడుగు భాగంలో ఉన్న ఇసుక, పెద్ద రాళ్ల గుర్తింపుతో పాటు గోదావరి ప్రవాహ వేగంపై అధ్యయనం జరిగింది. ఆ మేరకు ఆధునిక

రూ.కోటి వ్యయం వృథా

పరిజ్ఞానమైన జీపీఎస్, హైడ్రోలాజికల్, టోపోగ్రాఫికల్ పద్ధతులు వినియోగించిన సంస్థ రాజమహేంద్రవరం నుంచి నాసిక్ వరకు జల మార్గం సాధ్యమేనని తేల్చిచెప్పింది. వాస్తవానికి భద్రాచలం, చింతూరు డివిజన్ల నుంచి రాజమహేంద్రవరానికి జలమార్గం కొత్తేమీ కాదు. ఐదున్నర దశాబ్దాల క్రితం భద్రాచలం, చింతూరు ఏజెన్సీ దట్టమైన అడవులతో వెనుకబడిన ప్రాంతాలుగా ఉండేవి. నాడు రాజమహేంద్రవరం నుంచే కుక్కునూరు, వెలేరుపాడు, కూనవరం, వరరామచంద్రపురం, చింతూరు మండలాలతో పాటు తెలంగాణ రాష్ట్రం భద్రాచలం డివిజన్లోని దుమ్ముగూడెం, వెంకటాపురం మండలాలకు నిత్యావసర వస్తువులతో పాటు వ్యవసాయ పరికరాలు, ఎరువులు, డీజిలు తదితర సామగ్రి లాంచీల ద్వారానే దిగుమతి అయ్యేవి. తర్వాత ఇక్కడ పండించిన పంటలను రాజమహేంద్రవరానికి లాంచీల ద్వారానే ఎగుమతి చేసేవారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి కలప, వెదురులను గోదావరి మీదుగానే రాజమహేంద్రవరం చేర్చేవారు. దీంతో నిత్యం లాంచీల రాకపోకలు సాగేవి. నాటి కాలంలో భద్రాచలం నుంచి రాజమహేంద్రవరం లాంచీపై ప్రయాణం చేయడానికి ఒక్కో వ్యక్తికి రూ.3 నుంచి రూ.5 టికెట్ ఉండేది. కాగా ఈ జలమార్గం సర్వేతోనే సరిపెట్టుకోవడంతో ముందుకు సాగకుండా పోయింది.

అర్ధరాత్రి ఒంటి గంట నుంచే వ్రతాలు

- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్ వ్యవస్థ
- ఎక్కడికక్కడ హోల్డింగ్ పాయింట్లు
- అన్నవరంలో భీష్మ ఏకాదశి, మాఘపౌర్ణమి ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం



సమీక్షలో పాల్గొన్న అన్నవరం దేవస్థానం ఈవో, చైర్మన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది

అన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8వ తేదీన భీష్మ ఏకాదశి, 12వ తేదీ మాఘ పౌర్ణమి సందర్భంగా సత్యదేవుని సన్నిధికి విచ్చేసే భక్తుల సౌకర్యాల కల్పనపై శుక్రవారం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా భీష్మ ఏకాదశి పర్వదినాన సుమారు 80వేల మంది భక్తులు విచ్చేస్తారని, 12 నుంచి 15 వేలు వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తూ దానికణుగుణంగా ఏర్పాట్లపై దృష్టిసారించారు. అర్ధరాత్రి 12 గంటలకు వ్రతం టిక్కెట్లు విక్రయించి ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. కార్తీకమాసంలో రద్దీకి తగినట్టు చేసిన ఏర్పాట్ల కంటే మిన్నగా సౌకర్యాల కల్పనపై దృష్టిసారించాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్ వ్యవస్థ ఉండేలా చూడాలని ట్రాఫిక్‌ను సత్యగిరి కొండపైకి మళ్లించి ఉచిత వాహనాల ద్వారా భక్తులను రత్నగిరికి చేర్చాలని నిర్ణయించారు. ఎక్కడా తొక్కిసలాటలు జరగకుండా క్యూలైన్లు పటిష్టపరిచి, ఎక్కడికక్కడ హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటుచేసి రద్దీ ఆధారంగా క్యూలైన్ల ద్వారా భక్తులను వ్రతాలు, దర్శనాలకు అనుమతించాలని నిర్ణయించారు. సిబ్బంది అంతా సమన్వయంతో ముందుకెళ్లాలని ఈవో సూచించారు. భక్తులకు ఉచిత పులిహోర, దద్దోజన ప్రసాదాన్ని ఉదయం 8గంటల నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. ప్రోటోకాల్ వ్యక్తుల దర్శనాలు, సామాన్య భక్తుల దర్శనాలు ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు, ఎస్ఐ హరిబాబు, సర్పంచ్ కుమార్‌రాజా, దేవస్థానం ఏఈవోలు కొండలరావు, కృష్ణారావు, జగ్గారావు, సూపరెంటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, అనకాపల్లి ప్రసాద్, ఐవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో రజత పతకం



రజత పతకంలో నరాల లక్కీ

కాకినాడ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెనికి చెందిన నరాల లక్కీ అనే క్రీడాకారిణి హైదరాబాద్ యూసఫ్ గుడా కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో జరిగిన 40వ జాతీయ స్థాయి క్యోర్ యుగి, 13వ జాతీయ సీనియర్ పూమ్సే తైక్వాండో చాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో ప్రతిభ కనబరచి రజత పతకం సాధించింది. బీసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న లక్కీ ఈనెల 28 నుంచి 30 వరకూ జరిగిన తైక్వాండో సీనియర్ క్యోర్‌యుగి, పూమ్సే కేటగిరిలో ఈ పతకాన్ని గెలుపొందగా.. గతంలో రాష్ట్ర జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో రాణించి ప్రథమస్థానంలో నిలిచి స్వర్ణ పతకాలు పొందింది. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ పోటీలు జరిగాయి. సీనియర్ ఉమెన్ అండర్ 73 కిలోల విభాగంలో ఈ ఘనత సాధించింది. సిల్వర్ పతకాన్ని సాధించిన లక్కీని గ్రామంలోని వివిధ రాజకీయపార్టీల నాయకులు, పెద్దలు అభినందించారు. లక్కీ మాట్లాడుతూ తైక్వాండో మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుందని, ప్రతీ ఒక్కరూ ప్రోత్సహించాలని కోరింది.

నేడు దంటు కళాక్షేత్రంలో భూతకాలం నాటకం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 31(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో గోవాడ క్రియేషన్స్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం భూతకాలం నాటకం ప్రదర్శిస్తామని దంటు కళాక్షేత్రం అధ్యక్షులు దంటు భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దంటు కళాక్షేత్రం గౌరవ సలహాదారుడిగా పనిచేస్తూ ఇటీవల మరణించిన డీవీఎస్ శర్మ, ప్రముఖ సంగీత దర్శకులు జి.సర్వేశ్వరరావుకు నివాళులర్పిస్తూ ఈ నాటకం ప్రదర్శిస్తామన్నారు. తొలుత డీవీఎస్ శర్మ సంతాప సభ జరుగుతుందని తెలిపారు.

జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్

విజయవంతానికి ప్రత్యేక కమిటీలు

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 15 నుంచి 28 వరకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అంశాల వారీగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో హాకీ టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయా అంశాలవారీగా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, జాయింట్ కలెక్టర్, డీఆర్వో, సీపీవో, డీఎస్డీవోలు సభ్యులుగా ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీ, వివిధ ఉప కమిటీల సహకారంతో టోర్నమెంట్ నిర్వహణ అన్ని అంశాలపై పర్యవేక్షిస్తుందన్నారు. డీటీసీ నేతృత్వంలో ట్రాన్స్‌పోర్టు, రిసెప్షన్ కమిటీ క్రీడాకారులకు స్వాగతం, రవాణా, బస సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు.డీడీ-గ్రౌండ్ వాటర్ నేతృత్వంలో రిజిస్ట్రేషన్ కమిటీ పాల్గొనేందుకు వచ్చిన టీముల రిజిస్ట్రేషన్ కమిటీ పాల్గొనేందుకు వచ్చిన టీముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించి వారికి అవసరమైన ఏర్పాట్ల కోసం మిగిలిన సబ్ కమిటీలకు సూచించాలన్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డియం నేతృత్వంలో ఫుడ్ కమిటీ క్రీడాకారులకు ఆహార ఏర్పాట్లను, కాకినాడ ఆర్డీవో నేతృత్వంలోని అకామిడేషన్ కమిటీ క్రీడాకారులకు బస ఏర్పాట్లను, ఏపీసీ సమగ్రశిక్ష నేతృత్వంలో టెక్నికల్ కమిటీ పోటీల నిర్వహణకు సంబంధించిన సాంకేతిక అంశాలను, డీఎంహెచ్‌వో నేతృత్వంలోని మెడికల్ కమిటీ కీడాకారులకు ప్రథమ చికిత్స, అంబులెన్స్ సేవలను నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, డీఎస్డీవో శ్రీనివాసకుమార్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి పాల్గొన్నారు.

8 నుంచి వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు

కాకినాడ అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు ఫిబ్రవరి 8 నుంచి 10 వరకు రాష్ట్రస్థాయి సెమినార్, క్రీడా పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరుగుతాయని వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ ఉమ్మడి తూర్పుగోదారి జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తిగల ఉపాధ్యాయులు ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు కాకినాడ డీఎస్ఏలో జరిగే ఎంపికల్లో పాల్గొనాలన్నారు. వివిధ క్రీడల్లో మహిళ, పురుష క్రీడాకారులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారని రాష్ట్ర సంఘ అధ్యక్షుడు లంకా జార్జి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నూకరాజు, కోశాధికారి జి.రవికౌర్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో శిశు ఆధార్ సేవలు

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో శిశు ఆధార్ సేవలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గైనిక్ విభాగంలోని బర్త్ రిజిస్ట్రేషన్ వార్డులో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డా. ఎస్.రాజకుమారి రిజిస్ట్రార్‌గా వ్యవహరించనున్నారు. జీజీహెచ్ మెడికల్ రికార్డ్సు విభాగం సెక్షన్ ఆధ్వర్యంలో ఈ సేవలు అందనున్నాయి. శిశువు పుట్టిన వెంటనే ఆధార్ కార్డు మంజూరు చేయడం ఈ పథకం లక్ష్యం. ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శ్రీనివాసన్, అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ ఎన్.శ్రీధర్, గైనిక్ హెచ్‌వోడి డా.అనురాగమయి, ఎంఆర్‌డీ, ఎంఆర్‌వో జయచంద్ర పాల్గొన్నారు.

పీఏడీఏ పీడీగా శ్రీధర్

డిప్యూటీ కలెక్టర్, కాకినాడ జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్‌ను పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పీఏడీఏ) పీడీగా నియమిస్తూ కలెక్టర్ షాన్‌మోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆరుగురు అధికారులను కలెక్టర్ ఈ విధానంలో నియమించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

108 రకాల పిండి వంటలతో నైవేద్యం

అన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించకుని శుక్రవారం గ్రామంలో వాసవీమాత ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి 108 రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు. ముందుగా ఉదయం 10గంటలకు గ్రామంలో వైశ్యులు వ్యాపార సముదాయాలను మూసివేసి అమ్మవారిని పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించి జై వాసవీ నినాదాలతో హోరెత్తించారు. వాసవీక్లబ్, వనితాక్లబ్, ఆర్యవైశ్య సంక్షేమసమాజం ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో గ్రామస్థులు అమ్మవారిని దర్శించారు. ఎమ్మెల్యే సత్యప్రభ వాసవీమాత గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో వాసవీ, వనిత క్లబ్ నాయకులు దాసరి గౌతమి, అమరా వీరలక్ష్మి, దాసరి రజనీ, పులవర్తి నవీన్, దాసరి కుమార్, విహారి, సంఘనాయకులు దాసరి ప్రసాద్, శంకర్, గణపతి, జొన్నాడ రాజేష్, బోనగిరి శ్రీనివాస్, కడిమిశెట్టి సతీష్ ఉన్నారు.



అమ్మవారికి నివేదించిన 108 రకాల వంటలు



ఎమ్మెల్యే సత్యప్రభకు స్వాగతం పలుకుతున్న మహిళలు

వాహనాల సామర్థ్య పరీక్ష సెంటర్ ప్రారంభం



వాకలపూడిలో ప్రారంభమైన సెంటర్

సర్పవరం జంక్షన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా వాకలపూడి ఏడీబీ రోడ్డులో కంట్రోల్ ఆల్ట్ పిక్స్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఆటోమేటెడ్ సామర్థ్య పరీక్షల సెంటర్ (ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్)ను ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు చెరుకూరి కిరణ్, పొట్లూరి బుజ్జిబాబు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వాహనాలు పూర్తి ఫిట్‌గా ఉండాలన్న లక్ష్యంతో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దేశవ్యాప్తంగా ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్‌స్టేషన్లు మంజూరు చేసిందన్నారు. ఇందులో ఏపీలో 22 సెంటర్లు మంజూరు కాగా తమ సంస్థ ఆధ్వర్యంలో అనకాపల్లి, రాజమహేంద్రవరంతో పాటూ వాకలపూడిలో ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్లు ప్రారంభించడం జరిగిందన్నారు. ఒకేసారి 4 వాహనాలకు టెస్టింగ్ సామర్థ్యంతో ఈ సెంటర్ ప్రారంభించామన్నారు. ఒక్కో వాహనానికి 20 నిమిషాల సమయం పడుతుందన్నారు. టెస్టింగ్ అనంతరం ఆన్‌లైన్‌లో జారీ చేసిన సర్టిఫికెట్‌ను యాజమానికి అందివ్వడం జరుగుతుందన్నారు. అన్ని రకాల వాహనాలకు సుమారు 36 రకాల ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించేందుకు అవసరమైన అనుమతులను కేంద్రం నుంచి పొందడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సలహా మండలి సభ్యులు మేకా లక్ష్మణరావు, ఆదినారాయణ, మీసాలరాజు, పలువురు వాహన యాజమానులు పాల్గొన్నారు.

కరప సొసైటీ ఇన్‌చార్జ్ సీఈవో ఆత్మహత్య



కాకినాడలోని లాడ్జిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ కరప సొసైటీ సీఈవో నక్కా నారాయణమూర్తి



మృతుడు నారాయణమూర్తి(ఫైల్)

- కాకినాడలోని లాడ్జిలో ఉరేసుకుని బలవన్మరణం
- చేయని తప్పుకు ఇరికించారని మృతుడు నారాయణమూర్తి సూసైడ్ నోట్
- సొసైటీ సొమ్ములు దుర్వినియోగంపై విచారణ
- తిరిగి కట్టాలని అధికారులు ఒత్తిడి చేయడమే మూర్తి చావుకు కారణమా..?

కరప, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కరప సొసైటీ ఇన్‌చార్జ్ సీఈవో నక్కా నారాయణమూర్తి (27) అకస్మాత్తుగా బలవన్మరణానికి పాల్పడ డంతో గ్రామం లో విషాదఛాయలు అలముకున్నాయి. ఎప్పు డూ చలాకీగా ఉంటూ..అందరితో కలుపుగోలుతనంగా వ్యవహరించే మూర్తి ఆత్మ హత్య చేసుకోవడాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. మూర్తి తండ్రి వీరబాబు టీడీపీ సీనియర్ నా యకుడు కాగా ప్రస్తుతం చిరువ్యాపా రం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చేతికందివచ్చి న కుమారుడు, వివాహం చేయాలనుకుంటున్న తరుణంలో అకాల మరణం చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



రోదిస్తున్న కుటుంబసభ్యులు, కాకినాడ లాడ్జి ఎదురుగా రోడ్డుపై బైఠాయించి ఆందోళనచేస్తున్న బాధితులు

సొసైటీ సొమ్ములు దుర్వినియోగంపై విచారణ

కరప ఇన్‌చార్జ్ సీఈవోగా గత ఏడాది సెప్టెంబరులో నారాయణమూర్తి బాధ్యతలు తీసుకున్నారు. కాగా సొసైటీలో రుణాలు తీసుకున్న కొంతమంది రైతులు ఇటీవలె ఆ తీసుకున్న బాకీలను తిరిగి కట్టారు. అయితే వారిలో ఒక రైతు లోను సొమ్ము జమయ్యిందా అని స్థానిక కో-ఆపరేటివ్ బ్రాంచ్‌లో కట్టిన రసీదును అధికారులకు చూపించినట్టు తెలిసింది. రికార్డులో ఆ సొమ్ము కట్టినట్టులేకపోవడంతో అనుమానం వచ్చిన కో-ఆపరేటివ్ బ్యాంక్ అధికారులు సొసైటీలోని ఎల్‌టీ, ఎస్‌టీ, రైతునేస్తం, తదితర రికార్డులను పరిశీలించగా పెద్దమొత్తంలో రుణాల సొమ్ము పక్కదారి పట్టినట్టు తేలింది. దీనికి మూర్తిని బాధ్యుడిని చేస్తూ వెంటనే ఆ సొమ్ములు చెల్లించాలని అధికారులు పట్టుబట్టినట్టు సమాచారం. అంతవరకు ఇన్‌చార్జ్ సీఈవోగా జడ్.బావారం సీఈవో వెంకటేశ్వరరావుకు బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. సీఈవోగా తనను తప్పించడం, చేయని తప్పుకు బాధ్యుడ్ని చేయడం అవమానంగా భావించి నారాయణమూర్తి ఆత్మహత్యకు పాల్పడినట్టుగా సన్నిహితులు చెబుతున్నారు. దీనిపై కరప సొసైటీ స్పెషలాఫీసర్ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా రికార్డుల ప్రకారం రూ.12లక్షల వరకు సొసైటీ సొమ్ములు దుర్వినియోగమైనట్టుగా విచారణలో తేలిందన్నారు. అందులో కొంత సొమ్ము రికవరీ అయ్యిందని, మిగిలిన సొమ్ములను కట్టమని మూర్తి కుటుంబ సభ్యులకు సూచించామని, ఇంతలో ఇలా జరగడం దారుణమని ఆయన విచారం వ్యక్తంచేశారు.

'ఎమ్మెల్యే గారు మా ఫ్యామిలీకి హెల్ప్ చేయండి '

అమ్మా, నాన్న, అక్క, బావ అందరూ కలిసి ఉండండి..మిత్రులారా లగ్జరీకి పోకుండా జాగ్రత్తగా ఉండండి.. నేనెవరికీ రూపాయి కూడా ఇవ్వక్కర్లేదు..చేయని తప్పుకు నన్ను ఇరికించారు...జనసేనకు సపోర్టు చేశానని చాలా బాధపెట్టారు. ఇప్పుడు జనసేన అధికారంలోకి వచ్చినా సుఖం లేదు. ఎమ్మెల్యేగారు మా ఫ్యామిలీకి ఏమైనా హెల్ప్ చేయండంటూ... నారాయణమూర్తి ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రాసిన మూడు సూసైడ్ నోట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బంధువుల ఆందోళన

కాకినాడలోని లాడ్జి నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ మృతుడి బంధువులు, స్నేహితులు లాడ్జి ఎదురుగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మృతిపై తమకు అనుమానాలున్నాయని, సీసీ టీవీ ఫుటేజీ ఇవ్వాలని లాడ్జి యాజమాన్యాన్ని వారు ప్రశ్నించారు. అంతవరకు మృతదేహాన్ని తరలించడానికి అంగీకరించమంటూ భీష్మించుకుని కూర్చున్నారు. సీసీ కెమేరాలున్నాయి గానీ, కొంతకాలంగా అవి పని చేయడంలేదని లాడ్జి నిర్వాహకులు చెప్పడంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. కాకినాడ టూటౌన్ పోలీసులు బాధితులతో మాట్లాడి శాంతింపజేయడంతో ఆందోళన విరమించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమి త్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు.

మండపేటలో రూ.30 కోట్లకు టోకరా?

- అటు భక్తిమార్గం.. ఇటు వడ్డీ వ్యాపారం
- అధిక వడ్డీ ఆశతో భారీగా అప్పులిచ్చిన మహిళా భక్తులు
- బోర్డు తిప్పేయడంతో బాధితులు లబోదిబో

మండపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భక్తిముసుగు లో మహిళా భక్తులే లక్ష్యంగా అధికవడ్డీ ఎరజూపి వారి వద్ద నుంచి లక్షలాది రూపాయలు సేకరించి ఏకంగా రూ.30 కోట్ల మేర బోర్డును తిప్పేసిన సంఘటన ఆలస్యంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేటలో వెలుగుచూసింది. మండపేటకు చెందిన ఒక వ్యక్తి గత కొంతకాలం నుంచి దేవుడు ముసుగులో భక్తులను ఆకర్షించి వారితో మండపేట పరిసర ప్రాంతాల్లో భజనలు, కీర్తనలు నిర్వహిస్తూ వస్తున్నా డు. అధిక వడ్డీ ఇస్తానని చెప్పడంతో చాలామంది మహిళా భక్తులు అతడిని నమ్మి తమ వద్ద ఉన్న నగదును ఇచ్చారు. దీంతో అటు భక్తి కార్యక్రమాలు, ఇటు వడ్డీ వ్యాపారం నిర్వహి స్తూ మహిళల నుంచి ఏకంగా రూ.30కోట్ల వరకు తీసుకున్నాడు. కొన్నాళ్లపాటు సక్రమంగా వడ్డీ ఇస్తూ వచ్చిన అతడు ఆకస్మికంగా జెండా ఎత్తేశాడు. ఇంట్లో తెలిసి కొందరు, తెలియకుండా కొందరు మహిళలు లక్షలాది రూపాయలను ఇతడికి ఇచ్చినట్టు సమాచారం. ఇప్పుడు ఆ వ్యక్తి కనిపించకపోవడం, ఫోన్ పనిచేయకపోవడంతో వీరంతా మోసపోయి నట్టు గ్రహించారు. పట్టణంలోని కొందరు పెద్దల వద్ద ఈ మోసాన్ని చెప్పి న్యాయం చేయాలని వేడుకోగా, మరికొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నట్టు తెలిసింది. సదరు వ్యక్తికి ఉన్న ఆస్తులకు, అప్పులకు ఏమాత్రం సంబంధం లేకుండా ఉండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కాగా ఈ వ్యక్తిపై ఎటువంటి ఫిర్యాదు పోలీసులకు అందలేదు. ఏదొక విధంగా సొమ్ములు వస్తాయనే ఆశతో పెద్దలవద్ద పంచాయతీ జరుగుతున్న నేపథ్యంలో వేచిచూసే ధోరణిలో ఉన్నారు. న్యాయం జరగకపోతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



మృతుడు సూరాడ అప్పారావు

కొత్తపల్లి, జనవరి 31(ఆంధ్ర జ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన ఉప్పాడలో చోటుచేసుకొంది. మత్స్యకారులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరాడపేటకు చెందిన సూరాడు అప్పారావు(19) శుక్రవారం సహచర మత్స్యకారులతో వేటకు వెళ్ళాడు. వేట సమయంలో సముద్రంలో కెరటాల ఉధృతికి వల లాగుతున్న అప్పారావు దురదృష్టవశాత్తు జారి సముద్రంలో పడి గల్లంతయ్యాడు. మత్స్యకారులు సాయంత్రం వరకు వలలతో గాలింపు చర్యలు చేపట్టడంతో అప్పారావు మృతదేహం వలకు చిక్కడంతో ఒడ్డుకు చేర్చారు. వేట ముగించు కుని త్వరగా ఇంటికి చేరుకుంటానన్న అప్పారావు మాట తలచుకొని కుటుంబ సభ్యులు విలపిస్తుంటే చూపరుల కంటతడిపెట్టించింది.

వ్యక్తిగత కారణాలతో..

వృద్ధ దంపతుల ఆత్మహత్య

- విదేశాల్లో స్థిరపడిన పిల్లలు..
- మానసిక ఒత్తిడితో కాకినాడ ఉప్పుటేరులోకి దూకి బలవన్మరణానికి పాల్పడిన దంపతులు

కాకినాడ క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై కాకినాడ జగన్నాథపురం ఉప్పుటేరులోకి దూకి దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కాకినాడ జగన్నాథపురానికి చెందిన వృద్ధ దంపతులు ఎం.ఆదిమూర్తి(65), ధనలక్ష్మి(60) భార్యభర్తలు. కాగా వారి పిల్లలు విదేశాల్లో స్థిరపడడంతో ఆ వృద్ధ దంపతులు కాకినాడలో ఉంటున్నారు. వారిలో ఒకరు అనారోగ్యం పాలైతే మరొకరు వారి ఆలనాపాలనా చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా వారు మానసిక ఒత్తిడికి, శారీరక ఒత్తిడికి గురౌతున్న నేపథ్యంలో తీవ్రమనస్తాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో వారిద్దరూ మరణమే శరణ్యమని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం జగన్నాథపురం ఎన్‌టీఆర్ వారధి వద్దకు వచ్చి ఉప్పుటేరులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అనంతరం కుటుంబసభ్యులు విగతజీవులుగా మారిన ఆ వృద్ధ దంపతులను గుర్తించి మృతదేహాలను ఖననం నిమిత్తం స్వగృహానికి తరలించారు. ఈ విషయంపై కాకినాడ వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావును వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, అందువల్ల కేసు నమోదు చేయలేదని తెలిపారు.

వివాహిత హత్యకేసులో

వీడిన మిస్టరీ

- పందలపాక హత్యకేసులో వ్యక్తి అరెస్టు
- వివాహేతర సంబంధమే కారణం

బిక్కవోలు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వివాహిత హత్యకేసులో మిస్టరీ వీడింది. తూర్పుగోదావరిజిల్లా బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన వివాహిత లలితేశ్వరి ఈనెల 29న ఆమె పనిచేస్తున్న బరకాల కొట్టులో మృతి చెందిన ఘటన విధితమే. దీనిపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ మేరకు శుక్రవారం అనపర్తి సీఐ సుమంత్ వివరాలు వెల్లడించారు. సంచుల కొట్టులో గుమస్తాగా పనిచేస్తున్న లలితేశ్వరికి అదే గ్రామానికి చెందిన గుంతికోలు దుర్గాప్రసాద్‌కు గత కొంతకాలంగా పరిచయం ఉంది. అయితే ఇటీవల లలితేశ్వరి దుర్గాప్ర సాద్‌ను దూరం పెట్టడంతో కోపం పెంచుకున్నాడు. ఇదిలావుండగా ఈనెల 29న తెల్లవారుజామున ఆమె పనిచేస్తున్న సంచుల కొట్టు వద్దకు పిలిచాడు. ఆమె వాకింగ్‌కు వెళుతున్నానని చెప్పి సంచుల కొట్టు వద్దకు వెళ్లింది. అక్కడే ఉన్న దుర్గాప్రసాద్ తనను దూరం పెట్టడంపై లలితేశ్వరితో వివాదానికి దిగాడు. ఈ వివా దం పెరిగి దుర్గాప్రసాద్ కేబుల్ వైరుతో మెడకు చుట్టి గట్టిగా నొక్కి చంపేసి పారిపోయాడు. ఈ మేరకు సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడైన దుర్గాప్రసాద్‌ను గురువారం రాత్రి 11 గంటలకు పందలపాక సెంటర్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు. మృతురాలి హత్యకేసులో ఇంకా ఎవరైనా ఉ న్నారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అసలేం జరిగింది ?

తణుకు రూరల్ ఎస్‌ఐ మూర్తి మరణంపై భిన్న వాదనలు



కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు

ఆత్మహత్య చేసుకున్నాడు

- సోదరుడు, సోదరి

'చిన్నప్పటి నుంచి అనుకున్నది సాధించాలనే పట్టుదల ఉన్న వ్యక్తిత్వం తనది. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలో వున్న మూర్తిని, ఏలూరు రేంజిలో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు చెప్పారు. దీంతో ఎక్కడ తనకు దూరంగా పోస్టు వస్తుందోనని భావించాడు. జరిగిన దానిని వదిలేయ్ మళ్లీ ఉద్యోగం వస్తుంది. ధైర్యంగా ఉండు. లేదంటే ఉద్యోగం వదిలేసి వచ్చేయమని చెప్పాం. ఉదయం స్టేషన్‌కు వెళ్లిన కొద్దిసేపటికే రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోయాడు. పోలీసులు, మీడియా తీరు వల్లే ఇలా జరిగింది. సంబంధం లేని విషయాన్ని పెద్దభూతంలా చేశారు. ఇప్పుడు మనిషే పోయాడని సోదరుడు వెంకటేష్, సోదరి శ్రీలక్ష్మి కన్నీరు మున్నీరుగా విలపించారు. 'మూర్తి ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు. అతని ఫోన్ కాల్ లిస్టు బయటపెట్టాలి. అతని మృతిపై అనుమానాలు ఉన్నాయి. అధికారుల వేధింపులు ఉన్నాయా ? అనే విషయం తేలాలి. సెల్‌ఫోన్, వీడియోలు బయటపెట్టాలి' అని ఆయన స్నేహితుడు కె.గంగవరానికి చెందిన వెంకటరమణ డిమాండ్ చేశారు.

తణుకు/కె.గంగవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వీఆర్‌లో వున్న తణుకు రూరల్ ఎస్‌ఐ ఏజీఎస్ మూర్తి(38) మృతిపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మూర్తి ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, బ్యాచ్‌మేట్స్, కుటుంబ సభ్యులు ఆరోపిస్తుంటే.. కాదు గన్‌మిస్ ఫైర్ అయ్యిందని జిల్లా ఎస్పీ నయీం అస్మి చెబుతున్నారు. కుటుంబ సభ్యులు, సహోద్యోగుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరానికి చెందిన ఆదుర్తి గోపాలరావు, తల్లి సూర్యావతిలకు ఇద్దరు



స్టేషన్ వద్ద బంధువులు

కుమారులు వెంకటేష్, మూర్తి, కుమార్తె శ్రీలక్ష్మి. మూర్తి టెన్త్ వరకు స్వగ్రామంలోనే చదివాడు. ఎంతో కష్టపడి 2012లో ఎస్‌ఐ ఉద్యోగం సాధించాడు. విజయలక్ష్మితో వివాహం కావడంతో వీరికి కుమారుడు చందన్(5) కుమార్తె హేమాన్షి (16 నెలలు) ఉన్నారు. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని మచిలీపట్నం, కైకలూరు, భీమవరం టూ టౌన్, పాలకోడేరు, పెరవలి, నరసాపురం రూరల్, ఆచంట, తణుకు రూరల్ స్టేషన్‌లలో పనిచేశాడు. వేల్పూరులో రెండు గేదెల అపహరణ కేసులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో నాలుగు నెలలు క్రితం పోలీసు ఉన్నతాధికారులు వీఆర్‌లో పెట్టారు. అప్పటి నుంచి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. తనకు సంబంధం లేని కేసులో వీఆర్‌కు పంపారని అవమానంగా భావించాడు. పెనుగొండలో సీఎం పర్యటనకు బందోబస్తుగా వెళ్లాలని ఆదేశాలు రావడంతో.. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు తణుకు రూరల్ పోలీసుస్టేషన్‌కు బైక్‌పై వచ్చాడు. కొంతసేపటికి సర్వీసు రివాల్వర్ తీసుకుని పక్కనే ఉన్న వాష్ రూమ్‌కు వెళ్లి కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ విషయం తెలియగానే ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన 2012 బ్యాచ్ ఎస్‌ఐలు పెద్ద ఎత్తున తణుకు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. అందరికి ధైర్యం చెప్పే మూర్తి ఇలా ఎందుకు చేశాడోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేగింది. ఉన్నతాధికారుల నుంచి రకరకాల ఒత్తిళ్ల సిబ్బందిని కుంగిపోయేలా చేస్తున్నాయనే విమర్శలు వచ్చాయి.



ఎస్‌ఐ మూర్తి

రివాల్వర్ మిస్ ఫైర్ : ఎస్పీ నయీం



'ఎస్‌ఐ మూర్తి ఉదయం స్టేషన్‌కు వచ్చారు. అందరితోనూ మాట్లాడి వాష్ రూమ్‌కు వెళ్లారు. అక్కడ రివాల్వర్ మిస్ ఫైర్ అయ్యింది. దీనిని గమనించి సిబ్బంది 108లో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మూర్తి చనిపోయారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగులోకి తెస్తాం' అని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ నయీం అస్మి తెలి పా రు. ఆయన వెంట ఏఎస్పీ భీమారావు తదితరులున్నారు. ఎస్‌ఐ కుటుంబానికి న్యాయం చేస్తామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఆసుపత్రిలో మూర్తి మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కోటిపల్లిలో శనివారం పోలీసు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు పామర్రు ఎస్‌ఐ ఎస్‌కే జానీ బాషా చెప్పారు.

ఆర్యవైశ్యులకు అండగా టీడీపీ ప్రభుత్వం

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కంచర్ల



తాటిపాకలో శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి

రాజోలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు అండగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి అన్నారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి ఆధ్వర్యంలో తాటిపాకలో శుక్రవారం ఆర్యవైశ్యులు వాసవీ అమ్మవారి నగర సంకీర్తన ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. జిల్లాలో బాబి పిలుపు మేరకు ప్రతీ గ్రామంలో, ప్రతీ మండలంలో ఉన్న ఆర్యవైశ్యులు ఎంతో భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. కొత్తపేట శ్రీ వాసవీ కల్యాణ మండపంలో వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి జిల్లా అధ్యక్షుడి హోదాలో బాబి పట్టువస్త్రాలు సమర్పించారు. అల్లవరం మండలం బోడసకుర్రులో కుంకుమ పూజలు చేశారు. అమ్మవారికి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలనచేసి వాసవీమాత సహస్రశ్లోకం పఠించారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా జీవో తీసుకువచ్చి అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, వాణిజ్య మంత్రి టీజీ భరత్, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డి.రాకేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు పోశెట్టి సూరిబాబు, అదనపు కార్యదర్శి కాసు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి లక్కింశెట్టి నానాజీ, యెండూరి పవన్‌కుమార్, గమిడి సూరిబాబు, పి.కృష్ణారావు, బాబి పాల్గొన్నారు.





రాజమహేంద్రవరంలోని పుష్కరాల రేవు వద్ద మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు, ఫ్లెక్సీతో ర్యాలీ చేస్తున్న పోలీసులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ

- తూర్పుగోదావరిజిల్లా పోలీస్ ఆధ్వర్యంలో మానవహారం

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో 200మంది పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు ఈర్యాలీని స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు ప్రారంభించారు. ఈ ర్యాలీ అజాద్ చౌక్, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా పుష్కరాల రేవువరకు సాగింది. అక్కడ పోలీసులు మానవహారం నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య, ఏఆర్ డీఎస్పీ రవికుమార్, ఎస్‌బీ సీఐ ఏ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్-1 నబి, ఇన్‌స్పెక్టర్-2 సీహెచ్ సూరిబాబు, వన్‌టౌన్, బొమ్మూరు, ధవళేశ్వరం, కడియం సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వివాదం

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఓ నర్సు వివాదాస్పదంగా వ్యవహరించడంతో శుక్రవారం ఆస్పత్రిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆస్పత్రిలో మేల్ నర్సుగా పని చేస్తున్న పోలాబత్తిన శ్రీనివాసరావు ఇటీవల రిపబ్లిక్‌డేలో కలెక్టర్ అందించిన అవార్డుల ప్రదానోత్సవంలో పేర్లు సిఫార్స్ చేయడంలో ఆస్పత్రి అధికారులు పక్షపాత వైఖరిని అవలంబించారని ఆరోపించాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం కొన్ని ఖాళీపత్రాలపై కొందరు ఉద్యోగులతో అవార్డులు ఇచ్చిన తీరు అసంతృప్తిగా ఉందని సంతకాలు చేయించాడు. ఆస్పత్రి ఉద్యోగ సంఘం జేఏసీ మద్దతు తనకు ఉందని ప్రచారం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న జేఏసీ నాయకులు మేల్ నర్సు వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈవిషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని జేఏసీ స్పష్టం చేసింది..

రాజ్యసభ సభ్యుడు పిల్లి బోస్‌కు అస్వస్థత



ద్రాక్షారామ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ స్వల్ప అస్వస్థతకు గుర య్యారు. ఈ విషయంపై ఆయన కుమారుడు నియో జకవర్గ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్‌ను సంప్ర దించగా శుక్రవారం ఉదయం పార్లమెంటు కు ఏవిధమైన ఆహారం తీసుకోకుండా వెళ్లడం వలన షుగర్ లెవెల్స్ తగ్గిపోవడంతో అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. ప్రస్తుతం కోలుకుంటున్నారని చెప్పారు.

యానిమేటర్ ఆర్పీలకు

ఉద్యోగ భద్రత కల్పించాలి

- యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

రాజమహేంద్రవరంఅర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యానిమేటర్లు అందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ యానిమేటర్ల ఆర్పీల యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి కోరారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో యానిమేటర్ల ఆర్పీల యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. శ్రీదేవి మాట్లాడుతూ అర్బన్‌లో ఉన్న సంఘాలను రూరల్‌లోకి మార్చాలని, 64 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, చిరుద్యోగులు, ఔట్ సోర్సింగ్ తదితర ఉద్యోగులు అందరూ కూటమి ప్రభుత్వం హామీలను నమ్మి ఓట్లు వేశారని వారికి న్యాయం చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి చిరుద్యోగికి రూ.26,000 జీతం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కనక, కోశాధికారి ఆర్.వరలక్ష్మి మాట్లాడారు. ముందుగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్, జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కె.రాంబాబు, మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి.లావణ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా, తూర్పుగోదావరి జిల్లాలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

డీఎస్పీని కలిసిన ఇరిగేషన్ డైరెక్టర్

అంబాజీపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సుంకర మురళీమోహన్‌ను రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీకి పుష్పగుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో అరిగెల సూరిబాబు, సాయిసూర్య ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, జనవరి31(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో 5ఎంవీఏ నుంచి 8ఎంవీఏకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయి పెంచుతున్నామన్నారు.

ఆర్యవైశ్యులకు మరిన్ని పథకాలు: ఎమ్మెల్యే గిడ్డి



ఎమ్మెల్యే సత్యనారాయణను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

అంబాజీపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రభుత్వం గుర్తించిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే అమ్మవార్ని దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అప్పన బాలాజీ, గ్రంధి శ్రీనివాస్, కాసు సాయిబుజ్జి, బొండాడ శివ, బోనగిరి కాశి, గెల్లి సంతోష్, నిట్టాల సాయి, నాయకలు గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ, మైపాల తాతాజీ, అరిగెల సూరిబాబు, అరిగెల బలరామమూర్తి, ముత్యాల జమీలు, రవణం రాము తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు కుంకుమపూజలు

అల్లవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం కాశీవిశ్వేశ్వరాలయం వద్ద వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య మహిళలు వాసవీమాతకు సామూహిక కుంకుమపూజలు చేశారు. మన్యం సూరిబాబు, వంకాయల వెంకటేశ్వరరావు, మోటమర్రి వెంకటరమణ, కంచర్ల నారాయణరావు, పసలపూడి వినయ్, ఎం.సుబ్రహ్మణ్యం, కె.వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారంతోనే సమస్యలు పరిష్కారం

- సమాచారం లేకుండా ఉద్యోగులు కౌన్సిల్‌కి హాజరుపై సభ్యుల మండిపాటు



మాట్లాడుతున్న చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ సమావేశానికి ప్రభుత్వ శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరైతేనే సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని, నామమాత్రంగా సాధారణ ఉద్యోగులు ఆయా శాఖల నుంచి హాజరైతే సమస్యలు ఏం పరిష్కారమవుతాయని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అజెండాను వాయిదా వేసి నగరపంచాయతీ సమస్యలపైనే చర్చించారు. గత కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సమక్షంలో కౌన్సిల్ సమావేశానికి హాజరుకాని ఉద్యోగులపై చర్యలకు నిర్ణయం తీసుకున్నాం కదా. ఇంత వరకు ఎవరిపైన ఏం చర్యలు తీసుకున్నారని వైసీపీ కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ కమిషనర్ పి.రవివర్మను ప్రశ్నించారు. సమావేశానికి హాజరుకాని వారిపై చర్యలకు కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని కమిషనర్ వివరణ ఇచ్చారు. విద్యుత్ శాఖఏఈ సమావేశానికి హాజరు కాకుండా జూనియర్ ఇంజనీర్ నాగేశ్వరరావు సమావేశానికి హాజరుకావడంపై ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ నిలదీశారు. పెంటావలెంట్ వ్యాక్సిన్‌ను పిల్లలకు వేసేందుకు అందుబాటులో లేదని వైద్య ఆరోగ్యశాఖవారు రెండు నెలలుగా వాక్సిన్ లేదని సమాధానం చెబుతున్నారని, దీనివల్ల పేదలు రూ.6వేల నుంచి రూ.8వేలు ఖర్చు అవుతుందని ములపర్తి బాలకృష్ణ ఆరోపించారు. దీనిపై అర్బన్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ప్రస్తుతం ఆ వ్యాక్సిన్ సరఫరాలో జాప్యం జరిగిందని, వచ్చిన వెంటనే వేయించేందుకు చర్యలు తీసుకుంటామని సంజాయిషీ ఇచ్చారు. 50ఏళ్లుగా ప్రభుత్వ స్థలాల్లో ఉంటున్నవారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తే ఇళ్ల నిర్మాణానికి వీలు ఉంటుందని, వారికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడంలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్ ఆరోపించారు. తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ స్పందించి ప్రభుత్వ భూముల్లో ఉంటున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్ నిబంధనలు ప్రకారం ఇవ్వకూడదన్నారు. వార్డుల్లో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు విషయాన్ని కౌన్సిలర్లకు తెలియచేయడం లేదని కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాసరావు గృహనిర్మాణశాఖ ఈఈ సుబ్రహ్మణ్యంకు సూచించారు. దీనిపై చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ స్పందించి గృహనిర్మాణాలకు లబ్ధిదారుల ఎంపిక విషయాన్ని వార్డు ప్రజాప్రతినిధులకు తెలియచేయాలని సూచించారు. గృహనిర్మాణాల మంజూరు విషయంలో లబ్ధిదారుల నుంచి మధ్యవర్తులు రూ.3వేలు వసూలు చేస్తున్నారని కౌన్సిలర్ గంజా శ్రీనివాస్ సమావేశంలో ఆరోపించారు. దీనిపై ఏసీ శ్రీనివాస్ స్పందించి ఎవరికీ ఇళ్ల నిర్మాణం మంజూరుకు సొమ్ములు ఇవ్వాలనవసరం లేదన్నారు. శానిటేషన్ సక్రమంగా చేయకపోవడం వల్ల దోమలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఫాగింగ్ చేయడంలేదని, వీధి లైట్లు సక్రమంగా వెలగడం లేదని కౌన్సిలర్ అడబాల సతీష్ ఆరోపించారు. దీనిపై కమిషనర్ పి.రవివర్మ స్పందించి స్ప్రేయింగ్, ఫాగింగ్ మిషన్లు పాడైయ్యాయని, కొత్తమిషన్ల కొనుగోలుకు చర్యలు చేపడుతున్నామని, అమలాపురం నుంచి ఫాగింగ్ మిషన్ తీసుకువచ్చి దోమల నిర్మూలనా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీ బస్టాండులోకి బస్సులు రాకపోకలు సాగించకపోవడం వల్ల విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ కడలి సౌజన్య కమిషనర్ దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి ఆర్టీసీ డీఎం, ఆర్ఎంల దృష్టికి తీసుకువెళతామన్నారు. తమ వార్డులో మంచినీరు సక్రమంగా విడుదల కావడంలేదని కౌన్సిలర్ కోటుం జయలక్ష్మి ఆరోపించారు. వైస్‌చైర్మన్ వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కోలా గంగాభవానీ

ముమ్మిడివరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ కోలా గంగాభవానీ పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. తొలుత మండలంలోని వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతిని వివరించారు. అయినాపురం శివారు మెట్టలంకలో ఏళ్ల తరబడి వాటర్ ట్యాంకు నిర్మాణంలో జాప్యం జరుగుతుందని, దీనికి అధికారులు నిర్లక్ష్యమా లేకా ప్రభుత్వ అలసత్వమా అని ఆ గ్రామ సర్పంచ్ మోకా రామారావు, ఎంపీటీసీ సభ్యుడు మట్టపర్తి సురేష్ ఆరోపించారు. దీనిపై ఎంపీడీవో శ్రీవెంకటాచార్య మాట్లాడుతూ సంబంధిత ఇంజనీరింగ్ అధికారి అత్యవసర పని మీద బయటికి వెళ్లారని, ముందు సమాచారం ఇచ్చే వెళ్లారని, మీ సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళతానని వివరణ ఇచ్చారు. మండల విద్యాశాఖాధికారి డి.గౌరీశంకర్ మాట్లాడుతూ మండలంలో పదో తరగతి పరీక్షలకు 7,347మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఈఏడాది నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయినాపురం ఎంపీటీసీ మట్టపర్తి సురేష్ మాట్లాడుతూ మధ్యాహ్నభోజన పథకానికి రేషన్ బియ్యమే సరఫరా చేస్తున్నారని, దీని వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడంలేదని ఆరోపించారు. దీనిపై ఎంఈవో గౌరీశంకర్ వివరణ ఇస్తూ విద్యార్థులకు సన్నబియ్యం ఇవ్వాలని, అయితే రేషన్ బియ్యంలో పోషక విలువలు ఉన్నాయంటూ ఆ బియ్యాన్నే సరఫరా చేస్తున్నారన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ప్రస్తుత సంవత్సరంలో 921పనులకు రూ.7.33కోట్లు నిధులు ఖర్చు చేశామన్నారు. 2,50,120 మందికి పనిదినాలు కల్పించామని, దినసరి వేతనం రూ.293 చెల్లించామన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ డి.గోపాలకృష్ణ, ఏవో ఏఎన్ఎనివాస్, ఈవోపీఆర్డీ ఎల్.కల్యాణి, డీఈఈ పాలకొల్లు విజయశ్రీనివాసరావు,సర్పంచ్‌లు ఎంపీటీసీలు, వివిధ శాఖలఅధికారులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం

కాట్రేనికోన, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి పట్టుదలతో ముందడుగు వేస్తే విజయాలు సాధ్యమవుతాయని డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. చెయ్యేరు ఇంజనీరింగు కళాశాలలో శుక్రవారం టెన్త్ మెరిట్ విద్యార్థులకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని మెరిట్ విద్యార్థుల కోసం ప్రేరణా కార్యక్రమాన్ని రూపొందించినట్టు తెలిపారు. సమ్మెటివ్ పరీక్షల్లో 520కి పైగా మార్కులు సాధించిన 320మంది విద్యార్థులకు ఈప్రేరణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు. విద్యార్థులు ప్రతి ప్రశ్నకు జవాబు ఇచ్చే విధంగా ఈకార్యక్రమం ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి.హనుమంతరావు, జిల్లా సైన్స్ అధికారి గిరిజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష ఎఫ్ఏవో ప్రవీణ్‌కుమార్, సబ్జెక్ట్ నిపుణులు, ఎంఈవోలను ఆయన అభినందించారు. విద్యార్థులకు మానసిక నిపుణులు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లా ఉపవిద్యాశాఖాధికారులు సూర్యప్రకాశం, పి.రామలక్ష్మణమూర్తి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పిల్లి రాంబాబు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పరువు హత్యచేసిన హంతకులను కఠినంగా శిక్షించాలి

అమలాపురం టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సూర్యపేటలో ప్రేమ వివాహం చేసుకున్నాడన్న నెపంతో పరువు హత్యకు పాల్పడిన హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో ధర్నా చేపట్టారు. హంతకుల ఆస్తులు జప్తుచేసి భార్గవికి ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కుల దురహంకారంతో వడ్లకొండ కృష్ణను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, రేవు తిరుపతిరావు, పొలమూరి మోహన్‌బాబు, ఎలిపే సత్యనారాయణ, ఊటాల వెంకటేష్, మోకా శ్రీను, సాపే రమేష్, వాకపల్లి హరీష్, నేల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నీలకంఠేశ్వరుని కల్యాణం



శ్రీపార్వతీసమేత నీలకంఠేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి దివ్యతిరు కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. కృతయుగం ఆరంభంలో సాక్షాత్తూ బ్రహ్మదేవుడు రుద్రయాగం చేయగానికి వేదికగా ఈఅంతర్వేది ప్రాంతాన్ని ఎంపికచేసి యారక్షణకు నీలకంఠేశ్వరస్వామిని ప్రతిష్ఠించి యాగాన్ని పూర్తిచేసిన మహాపుణ్యక్షేత్రం అంతర్వేది. శుక్రవారం ఉదయం 8 గంటలకు స్వామివారికి నిత్యోపాసన, బలిహరణ జరిగాయి. రాత్రి 7గంటలకు నందివాహనంపై స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. రాత్రి 8.30గంటల నుంచి శ్రీ పార్వతీ నీలకంఠేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకుల మంత్రోచ్చారణ నడుమ వైభవోపేతంగా నిర్వహించారు. మోరి గ్రామానికి చెందిన చింతా నరసింహారావు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణమహోత్సవ ప్రారంభానికి ముందు స్వామి-అమ్మవార్లకు అంతర్వేదికి చెందిన లక్కు సత్యనారాయణ రూ.95వేలు విలువచేసే వెండి కిరీటాలను బహూకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

ఉచిత దర్శనం కల్పించాలి

అంతర్వేది, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దివ్యతిరు కల్యాణోత్సవాల్లో భక్తులందరికీ పూర్తిస్థాయిలో ఉచిత దర్శనం కల్పించి దివ్య తిరు కల్యాణ మహోత్సవానికి టికెట్ లేకుండా ఉచితంగా ఏర్పాటుచేయాలని విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు శిరంగు నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథికి వినతిపత్రం అందించారు. తీర్థ మహోత్సవాల్లో దర్శనం, వీఐపీదర్శనం, కల్యాణాలకు టిక్కెట్లు కేటాయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఊటుకూరి సాంబయ్య, గోళ్ల వీరబాబు, దాట్ల వెంకటసుబ్బరాజు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ఈ-శ్రమ్ పోర్టల్

అమలాపురం టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అసంఘటితరంగ కార్మికుల సంక్షేమానికై భారత ప్రభుత్వ కార్మికశాఖ ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రవేశపెట్టిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో వివిధ శాఖల్లో పనిచేస్తోన్న కంటింజెంట్ ఎన్ఎమ్మార్, పారిశుధ్య, పీఎఫ్ లేని అసంఘటితరంగ కార్మికుల వివరాలు సేకరించాలని ఆదేశించారు. ప్రమాద బీమా రూ.2లక్షల వరకు ఉచితంగా పొందవచ్చన్నారు. కోనసీమ జిల్లాలో 8లక్షల మందిని ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయడం లక్ష్యంగా నిర్దేశించారన్నారు. ఇప్పటి వరకు 1.10లక్షల మంది నమోదు అయ్యారన్నారు. ఇంజనీరింగ్ శాఖల్లో భవన నిర్మాణ కార్మికులు, డీఆర్డీఏలో అంగన్‌వాడీలను, వీధి వ్యాపారాలు చేసేవారిని గుర్తించి ఈ-శ్రమ్‌లో చేర్పించాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది తీర్థానికి వేగంగా ఏర్పాట్లు: ఎమ్మెల్యే



అంతర్వేదిలో స్వామివారి తీర్థ మహోత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ

అంతర్వేది, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించి తీర్థ మహోత్సవ ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు నుంచి అంతర్వేదికి వచ్చే ప్రధాన రహదారులు కొత్తగా నిర్మించడంతో పాటు మరికొన్ని రహదారులకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను జేసీబీ సాయంతో తొలగించడం, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రహదారులను సిద్ధం చేస్తున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటిసారిగా జరుగుతున్న స్వామివారి ఉత్సవాల్లో పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా ముందుకు సాగుతున్నాయన్నారు. రాజోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీచైర్మన్ పినిశెట్టి బుజ్జి, ఉత్సవ సేవాకమిటీ సభ్యుడు దిరిశాల బాలాజీ, రాష్ట్ర జనసేన నాయకులు గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, చాగంటి స్వామి, గుబ్బల ఫణికుమార్, ఆకనబాబ్జినాయుడు, రావూరి నాగు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం ఆపండి: మల్లాడి



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లాడి

యానాం, జనవరి31(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియను నిలుపుదల చేయాలని పుదుచ్చేరి గవర్నర్ కైలాస్‌నాథన్‌ను పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. ఈమేరకు పుదుచ్చేరిలోని గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వాటికి సంబంధించిన అంశాలను గవర్నర్‌కు వివరించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారు ఉద్యోగాలు వచ్చే అవకాశాలు కోల్పోతారన్నారు. ముఖ్యంగా పాఠశాలలకు దాతలు స్థలాలు ఇచ్చారని వివరించారు. పాఠశాలలకు పెట్టిన వారి పేర్లు తొలగిపోయే అవకాశాలు ఉన్న నేపథ్యంలో మల్లాడి గవర్నర్‌తో పాటు సీఎం రంగసామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చౌహాన్‌కు వివరించారు. యానానికి సంబంధించిన పలు అంశాలను గవర్నర్‌తో చర్చించినట్టు మల్లాడి వివరించారు.

ప్రింటర్, జిరాక్స్ మెషిన్ బహూకరణ

అంతర్వేది, జనవరి31(ఆంధ్రజ్యోతి):సఖినేటిపల్లి జడ్పీ హైస్కూలుకు రూ.20వేలు విలువైన ప్రింటర్, జిరాక్సుమెషిన్ అందించినట్టు విద్యాకమిటీ చైర్మన్ వెంకటకిశోర్, బాబి తెలిపారు.

ఆనందోత్సాహాలతో బీబీజైనబ్ జయంత్యుత్సవం

మామిడికుదురు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మతస్థుల ఆరాధ్య దైవం ఇమామ్ హజరత్‌అలీ బీబీఫాతిమాజెహరా తనయురాలు బీబీజైనబ్ జయంతోత్సవాన్ని నగరం గ్రామంలో శుక్రవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. నగరంలోని మంజిలేకర్బలాలో ఖాశింమహ్మద్ రజా(రజ్వీ) ఆధ్వర్యంలో మిలాద్ జరిగింది. బీబీజైనబ్‌ను ఇస్లాం చరిత్రలో ఆదర్శ వనితగా కొలుస్తారు. పలువురు ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా బీబీజైనబ్ వృత్తాంతాన్ని వివరించారు. మొహిదీ అబ్బాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మతప్రబోధకులు సయ్యద్‌అబ్బాస్ బాకరీమిలాద్ ఆలపించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

2010 మంది పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లు ఆమోదం

అమలాపురం టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జీవన్‌ప్రమాణ్‌లో అప్‌లోడ్ చేసిన లైఫ్ సర్టిఫికెట్లు అన్నింటినీ ఆమోదించినట్టు అమలాపురం ఉపఖజానా అధికారి బీవీవీ రంగారావు తెలిపారు. సబ్‌ట్రెజరీ పరిధిలో 2010మంది పెన్షనర్లు జీవన్‌ప్రమాణ్‌లో లైఫ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయగా వాటిని ఆమోదించినట్టు తెలిపారు. కార్యాలయం పరిధిలో 2893మంది పెన్షనర్లు ఉండగా 2010 మందికి ఆమోదం లభించిందన్నారు. 883మంది పెన్షనర్లు తమ జీవన ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కోనసీమ జిల్లాశాఖ ప్రతినిధుల బృందం రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ఎస్‌సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏటీవో రంగారావును కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన పెన్షనర్లు కూడా తమ లైఫ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాశాఖ అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సాయివరప్రసాద్, కోశాధికారి జయంతి సోమేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎఫ్‌కు తేజస్విని ఎంపిక

అమలాపురం రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎస్కేబీర్ కళాశాల బీఎస్సీ విద్యార్థిని కె.పౌర్ణిమాతేజస్విని బీఎస్ఎఫ్‌కు ఎంపికైనట్టు కెప్టెన్ డాక్టర్ ఏవీశర్మ తెలిపారు. అస్సాం కేడర్‌లో త్వరలోనే తేజస్విని బాధ్యతలు చేపట్టనుంది. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన అభినందన సభకు ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. దిశ విభాగం మహిళాపోలీసు గంగాభవానీ మాట్లాడుతూ ఆత్మరక్షణ, స్వీయభద్రత వంటి అంశాలపై విద్యార్థినులకు వివరించారు.

రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

పి.గన్నవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కూటమి నాయకులు కృషి చేయాలని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు కోరారు. లంకలగన్నవరంలో శుక్రవారం ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మితో కలిసి ఎమ్మెల్సీ ఓట్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని అనంతరం మాట్లాడారు. బూత్‌లు వారీగా నియమించిన నాయకులు ప్రచారం నిర్వహించి రాజశేఖర్ గెలుపునకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, గనిశెట్టి ఈశ్వర్, గూటం రత్నంరాజు, యూనిట్ ఇంచార్జ్ పిల్లి శివయ్య, నల్లా పెద్దకాపు, కాల శ్రీను, గుత్తు శివ, షేర్ పోతురాజు, పెదపూడి దుర్గాప్రసాద్, వేమన గంగాధర్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు జనసేన సాయం

అల్లవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): దేవగుప్తం అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బుంగ చిట్టిబాబు కుటుంబానికి జనసేన మండల నాయకులు సాయం పంపిణీ చేశారు. 25కిలోల బియ్యం, రూ.8వేల నగదు, కూరగాయలు బాధిత కుటుంబానికి అందజేశారు. జనసేన నాయకులు కటికిరెడ్డి బాబి, కంకిపాటి వీరబాబు, నల్లా రాము, నాగిరెడ్డి సత్యనారాయణ, పొలమూరి బాబూరావు, తిక్కా శ్రీరామమూర్తి, రొక్కాల నాగేశ్వరరావు, పిల్లా ప్రసాద్, చికిలే చిట్టిబాబు, కంకిపాటి అరుణ్ పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి

రాజోలు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాజోలులో ప్రజా గాయకుడు గద్దర్ జయంతి దళిత చైతన్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. జేఏసీ రాజోలు మండల అధ్యక్షుడు మట్టా సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

నూతన ఒరవడితో ముందుకు..

ముమ్మిడివరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో విద్యాశాఖ నూతన ఒరవడితో ముందుకు సాగుతుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారు నిర్మించిన ఆర్వో ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం సీహెచ్ పరిమళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోరమండల్ ఇంటర్నేషనల్ జోనల్ హెడ్ కిశోర్‌వర్మ, హెచ్ఆర్ షణ్ముఖ, టీడీపీ నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, దొమ్మేటి రమణకుమార్, నడింపల్లి శ్రీనివాసరాజు, గొల్లపల్లి గోపి, స్కూలుకమిటీ చైర్మన్ జనిపల్లి దుర్గాప్రసాద్, వాసంశెట్టి అమ్మాజీ, కాకి మాణిక్యం, బడుగు సాయి, నిమ్మకాయల విస్సు, తొత్తరమూడి జ్యోతిబాబు, బూరిగ కల్యాణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ కార్యాలయాలు

మలికిపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రతీ జిల్లాలో ఏపీ మార్క్‌ఫెడ్ సొంత కార్యాలయం నిర్మించడానికి నిర్ణయం తీసుకున్నట్టు మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు తెలిపారు. విజయవాడలో మార్క్‌ఫెడ్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర సమావేశంలో స్థలం కేటాయించాలని కోరుతూ కలెక్టర్లకు లేఖ రాయడం జరిగిందన్నారు. సంస్థలో ఖాళీగా ఉన్న జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు భర్తీకి తీర్మానం చేశామన్నారు. ఢిల్లీ నుంచి మంజూరైన రూ.వెయ్యి కోట్లను రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్‌కు ఏడాది కాలపరిమితితో రుణం ఇవ్వడానికి తీర్మానం చేసినట్టు ఆయన తెలిపారు.

కనకదుర్గ విగ్రహ ప్రతిష్ఠ పూజలు

అల్లవరం, జనవరి31(ఆంధ్రజ్యోతి):అల్లవరం మార్కెట్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన విజయకనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఈనెల2న విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా శుక్రవారం కలశస్థాపన, వాస్తుహోమ పూజలు జరిగాయి. మంగళంపల్లి వెంకటసుబ్రహ్మశర్మ, పాండురంగ విఠల్, వారణాశి హనుమత్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు పూజలు చేశారు.

నియోజకవర్గస్థాయి కమిటీలు మార్చి 15నాటికి పూర్తి

పి.గన్నవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం నియోజకవర్గంలో పార్టీకి చెందిన వివిధ హోదాలకు సంబంధించి పదవులను త్వరలోనే పూర్తి చేస్తామని బహుజన్ సమాజ్‌పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ గుమ్మాపు చిత్రసేన్ తెలిపారు. పి.గన్నవరం బీఎస్పీ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కుసుమ వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 15న పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతి నాటికి స్థానిక నాయకులతో కలిసి పార్టీ పదవులు కేటాయింపు పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొల్లాబత్తుల సత్యం, బత్తుల లక్ష్మణరావు, కాశి లక్ష్మీభవాని, జాన్‌మోషే, తాడి రాంబాబు, ములపర్తి చందు, నేలపూడి లెనిన్, నెల్లి బాలు, నేలపూడి ప్రసన్నకుమార్, గోవిందరాజులు, ఎం.నాని, ఎస్.ఈశ్వర్‌భగవాన్, పి.గణేష్, దేవరపల్లి కిరణ్‌బాబు, కె.రవికుమార్, పి.రాధాకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వీర్వోకు సన్మానం

అల్లవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తే చిరకాలం గుర్తింపు లభిస్తుందని తహశీల్దార్ వీవీఎల్ నరసింహారావు అన్నారు. కొమరగిరిపట్నం వీఆర్వోగా ఉద్యోగ విరమణచేసిన మెట్ల ఆదినారాయణను తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం సన్మానించారు. డిప్యూటీ తహశీల్దార్ అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆర్ఐ కోడూరి మన్యం, యు.చిట్టిబాబు, మాచిరాజు ఉల్లీస్, ఎస్.చంద్రశేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

డాక్టర్ సత్యనారాయణ సేవలు చిరస్మరణీయం

అంతర్వేది, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అంతర్వేది, కేశవదాసుపాలెం, అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం గ్రామాల్లో శుక్రవారం డాక్టర్ పోతురాజు సూర్యవెంకటసత్యనారాయణ 24వ జయంతిని కుమారులు, గ్రామస్తులు, నాయకులు ఘనంగా జరిపారు. తొలుత అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్‌లో సత్యనారాయణ కాంస్య విగ్రహానికి పూలమాలలువేసి కుమారులు, నాయకులు నివాళులర్పించారు. ఉమ్మడి ఏపీలో ఆయన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేశవదాసుపాలెం కాల్వమొగ సెంటర్‌లో సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించి వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. దేవస్థానం, పల్లిపాలెంలో గ్రామాల్లో దుప్పట్లు, చీరలు పంపిణీ చేయడంతో తీరప్రాంత గ్రామాల్లో ఉన్న పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు. కుమారులు పోతరాజు వెంకటకృష్ణ, మాజీసర్పంచ్ పోతురాజు నాగేంద్రకుమార్, పోతురాజు లక్ష్మీనారాయణ, ఆకన బాబ్జినాయుడు, బెల్లంకొండ నరసింహారావు, చొప్పల బాబూరావు, దూది త్రినాథ్, ఉండపల్లి అంజి, అడబాల శ్రీను, మత్తయ్య, మేడిది మోహన్, వర్తకసంఘ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.1.02లక్షల విరాళం

మామిడికుదురు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఏరువ కేశవరెడ్డి-లక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1.02లక్షలు విరాళంగా అందించారు. దాతలకు అర్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించగా స్వామివారి చిత్రపటాన్ని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు అందించి అభినందించారు. శుక్రవారం స్వామివారిని 1400మంది దర్శించుకుని 650మంది నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,38,578 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ తెలిపారు.

బీఎస్పీ బలోపేతంపై సమీక్ష

అంతర్వేది, జనవరి 31(ఆంధ్రజ్యోతి): దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ శుక్రవారం వీవీమెరక గ్రామంలో రాజోలు నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ జాతీయ నాయకత్వ సూచన మేరకు సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి జాన్‌మోషే తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుమ్మాపు చిత్రసేన, కొల్లాబత్తుల సత్యం, బత్తుల లక్ష్మణరావు పాల్గొని సమీక్షించినట్టు తెలిపారు. బూత్‌స్థాయి నుంచి కమిటీలు నియమిస్తున్నట్టు, రాబోయే కాలంలో మరింత విస్తృతంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆకుమర్తి భూషణం, కార్యదర్శి కందికట్ల శశికుమార్, మోకా శ్రీనుబాబు, పట్నాల సత్యనారాయణ, మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ మోడల్ గ్రామంగా మలికిపురం ఎంపిక

మలికిపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సోలార్ మోడల్ గ్రామంగా మలికిపురం గ్రామాన్ని ఎంపిక చేసినట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. ప్రతీ ఇంటిపై సోలార్ పలకలు అమర్చి సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారన్నారు. ఒక కిలోవాట్ సామర్థ్యానికి రూ.30వేలు రాయితీ ఇస్తారని, 3కిలోవాట్ల వరకు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. 10శాతం యూనిట్ల విలువ లబ్ధిదారుడు చెల్లిస్తే మిగిలిన 90శాతం తక్కువ వడ్డీకి బ్యాంకు రుణం ఇవ్వడంతో పాటు సోలార్ విద్యుత్ ఆదాయం ద్వారా సర్దుబాటు చేసుకోవచ్చన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశం

అమలాపురం టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి అధ్యక్షతన నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజకుమారిని తొలుత సొసైటీ ప్రతినిధులు సత్కరించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ, కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, సభ్యులు డాక్టర్ పీఎస్‌శర్మ, ఆదిత్యకిరణ్, ప్రసాదరావు, బీవీ హనుమంతరావు, నల్లా నరసింహమూర్తి, జల్లి సుజాత, పట్నాల రమణ, కమల పాల్గొన్నారు.

ఘనంగా ఉత్సవమూర్తుల ఊరేగింపు

మామిడికుదురు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరం గ్రామంలో పునర్నిర్మించిన శ్రీఉమాసోమేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా శుక్రవారం స్వామివారి విగ్రహాలను ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా జరిపారు. మేళతాళాలు, భక్తుల కోలాహలాల మధ్య కార్యక్రమం అత్యంత సుందరంగా జరిగింది. బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాలను కంభంపాటి సుబ్రహ్మణ్యశ్రీనివాసశర్మ, పోతురాజు వెంకటరామనాగేశ్వరరావు, కిరణ్‌కుమార్ దంపతులు కర్తలుగా పాల్గొని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

25మంది పుదుచ్చేరి నుంచి యానాం బదిలీ

యానాం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని వివిధ శాఖల్లో పనిచేస్తోన్న యానానికి చెందిన ఎంటీఎస్ ఉద్యోగులను యానానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీరిలో12మందిని రెగ్యులర్ బదిలీకాగా 13మందిని సర్వీస్ ప్లేస్‌లో బదిలీ చేశారు. గతంలో వీరు యానాంలోని వివిధ శాఖల్లో డైలీరేటెడ్ ఉద్యోగులుగా పనిచేశారు. ఐదేళ్లుగా వీరిని రెగ్యులర్ చేయడానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లగా, 6నెలల క్రితం రెగ్యులర్ చేయించారు. అయితే 25మందిని పుదుచ్చేరి బదిలీ చేయడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఈఅంశం మల్లాడి సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, పాలనా సంస్కరణశాఖ కార్యదర్శి అండర్ సెక్రెటరీ, ఇతర అధికారులతో చర్చించారు. దీనిపై రెండు రోజులుగా మల్లాడి సీఎం రంగసామితో చర్చిస్తున్నారు. దీంతో శుక్రవారం సాయంత్రం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉద్యోగులు హర్షం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా వారు మల్లాడిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కుమార్తె అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

ముమ్మిడివరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): చినకొత్తలంక గ్రామానికి చెందిన 25ఏళ్ల అవివాహిత గురువారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని ఆమె తండ్రి శుక్రవారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ

ఉప్పలగుప్తం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను గిడుగు సత్యనారాయణ సహకారంతో హెచ్ఎం నూకల సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ గుర్లింక చిన్నా, గుర్లింక వెంకన్నబాబు, అరవ నాయుడు, నడింపల్లి పద్మనాభన్, పచ్చిమాల శివనాగరాజు, ముత్యాల నరసింహమూర్తి, వేటూరి వెంకటేశ్వరరావు, లక్ష్మి, పీడీ కామన మధు తదితరులు పాల్గొన్నారు.

మండపేట



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

ఆత్రేయపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,07,367 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

పంచాయతీ రికార్డులు తనిఖీ చేసిన డీపీవో



పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో శాంతాలక్ష్మి

కె.గంగవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం పంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతాలక్ష్మి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పంచాయతీ రికార్డులు పరిశీలించారు. రక్షిత మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్‌కు సంబంధించిన రికార్డుల నిర్వహణలో కార్యదర్శి సాయి రామ్‌కు పలు సూచనలు చేశారు. చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. వర్మీ కంపోస్టును తయారు చేసి డ్వాక్రా మహిళలకు శాంపిల్స్ ఇచ్చి ఇంటి వద్ద కూరగాయలు, పూల మొక్కలకు వేసి పెంచేలా వారిలో అవగాహన పెంచాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొటి లక్ష్మీనరసమ్మ, ఈవోపీఆర్‌డీ గౌరీకుమారి, కార్యదర్శులు చంటి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోండి



ఎక్సైజ్ కార్యాలయంలో గీత కులాల నాయకులతో చర్చిస్తున్న ప్రసాద్

ఆలమూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గీత కులాలకు మంజూరు చేసిన మద్యం షాపులకు దరఖాస్తులు అందించి సద్వినియోగం చేసుకోవాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కెడీవీ ప్రసాద్ పేర్కొన్నారు. ఆలమూరు ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం గీత కులాల నాయకులతో సమీక్ష జరిపారు. గీత కులాలకు కేటాయించిన షాపులకు వారు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. చివరి తేది దగ్గర పడుతున్నదని త్వరితగతిన కుల, నివాస ధ్రువపత్రాలతో దరఖాస్తులు అందించాలని ఈఎస్ ప్రసాద్ కోరారు. సమావేశంలో ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బాలమందిరం

ఆలమూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): చింతలూరు మండల ప్రజా పరిషత్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బాలమందిరం కార్యక్రమం చిన్నారులను ఆకట్టుకుంది. అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణశ్రీ అధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. రచయిత కృష్ణశ్రీ విద్యార్థులకు సాహిత్య పఠనం, కథ తయారీ, భాషా నైపుణ్యాలు, నాటకీకరణ, పాటలపై అవగాహన కల్పించారు. ఆయన నేర్పించిన విధానాలతో అప్పటికప్పుడు విద్యార్థులు వేసిన నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉడతా వెంకటేశ్వరరావు, వాసా దుర్గాప్రసాద్ సీఆర్‌ఎంటీ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



చింతలూరు మండల పరిషత్ పాఠశాలలో బాలమందిరం నిర్వహిస్తున్న దృశ్యం



సభలో మాట్లాడుతున్న న్యాయవాది సత్యవాణి

చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

కె.గంగవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది కేవీఏ సత్యవాణి, డి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో విధాన్ సే సమదాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రపురం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గుత్తుల దుర్గాదేవి, వెలుగు ఏపీయం దుర్గమ్మ, డ్వాక్రా యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట డీఎస్పీగా మురళీమోహన్



కొత్తపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డీఎస్పీగా సుంకర మురళీమోహన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కాకినాడ ఇంటెలిజెన్స్ నుంచి బదిలీపై కొత్తపేట వచ్చారు. ఇక్కడ పనిచేసిన వై.గోవిందరావు నార్త్ కోస్టల్ సెక్యూరిటీ మెరైన్ డీఎస్పీగా విశాఖపట్నం బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన మురళీమోహన్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్థులతో పాటు, వివిధ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కంటి వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు

ఆలమూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పెనికేరులో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా కంటి వైద్య శిబిరంలో 315 మందికి కంటి పరీక్షలు చేశారు. ఓఎన్‌జీసీ ఆర్థికసాయంతో నిర్వహించిన వైద్య శిబిరంలో వేమగిరి యోగానంద పరమహంస కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది ఎస్‌కె కరీముల్లా, పి.పద్మావతి, ఎన్.చంటిబాబు కంటి పరీక్షలు చేశారు. పెనికేరుతోపాటు పలు గ్రామాల నుంచి వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 15 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించడానికి వేమగిరి ఆసుపత్రికి తీసుకెళ్లారు. శిబిరంలో 155 మందికి ఉచితంగా కళ్లజోళ్లు, పలువురికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి వైద్య నిర్వాహకుడు ఈదల చినబాబు, ఓఎన్జీసీ ప్రతినిధి సంజీవ్, సర్పంచ్ వసుం చిన్నావతి, నాయకులు కోన దత్తుడు, గొడవర్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



పెనికేరులో మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



బీటలుతీసిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నీటి సంఘం అధ్యక్షుడు

బీటలువారిన వరిపొలాల పరిశీలన

కె.గంగవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): యండగండి గ్రామంలోని శివారు భూములకు నీటి ఎద్దడి ఎదురైంది. వారం రోజులుగా కాలువలోకి నీరు సరిగా రాకపోవడంతో సుమారు 150 ఎకరాల్లో వరి పొలాలు బీటలు తీశాయి. రైతులు నీటి సమస్యను నీటి సంఘం అధ్యక్షుడు ఆచంట శ్రీనుకు తెలిపారు. శుక్రవారం ఆయన ఇరిగేషన్ ఏఈ సుబ్రహ్మణ్యం, గుమస్తా రాజుతో కలిసి యండగండిలో బీటలుబారిన పొలాలను పరిశీలించారు. తక్షణమే వంతు ఏర్పాటు చేసి సాగునీరు అందిస్తామని ఏఈ తెలిపారు. శనివారం నుంచి వంతుల వారీ విధానం అమలులోకి వస్తుందన్నారు.



కలవచర్లలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజు

రోడ్ల నాణ్యతలో రాజీలేదు

ఆలమూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే సీసీరోడ్ల నిర్మాణాల్లో రాజీపడకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. ఆలమూరు మండలం కలవచర్లలో శుక్రవారం సీసీ రోడ్ల నిర్మాణాలను సర్పంచ్ వడ్డి వెంకన్న, కార్యదర్శి వేణిలతో కలసి పరిశీలించారు. మండల పరిషత్, ఉపాధి హామీ పథకం, ఆర్థిక సంఘం నిధులతో పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. నాణ్యతలో రాజీపడకుండా కాంట్రాక్టర్లు పనులు చేపట్టాలని ఎంపీడీవో కోరారు.

రెండో రోజూ కొనసాగిన వైజ్ఞానిక ప్రదర్శనలు

రాయవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాయవరం సాయితేజా స్కూల్‌లో విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు రెండోరోజు కూడా కొనసాగాయి. కరస్పాండెంట్ కర్రి భానురేఖా, సందీప్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ పట్ల మరింత మక్కువ పెంపొందించడంతో పాటు వారికి ప్రయోగాలపై మరింత ఆసక్తి పెంపొందించేందుకు ఈ ప్రదర్శనలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. విద్యార్థుల పలు ప్రదర్శనలను తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు.

వాసవీ అమ్మవారికి పూజలు

ఆత్రేయపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆత్రేయపురం ర్యాలీ, ఉచ్చిలి, వెలిచేరు, అంకంపాలెం తదితర గ్రామాల్లో వాసవి మహిళలు అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.



మేలుజాతి గేదెను నెల్లూరు జిల్లాకు తరలిస్తున్న దృశ్యం

నెల్లూరు జిల్లాకు మేలుజాతి గేదెల తరలింపు

మండపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండపేటకు చెందిన పాడి రైతుల నుంచి సేకరించిన మేలుజాతి పశువులు మూడింటిని ఎంపిక చేసి నెల్లూరు జిల్లా చింతలదీవిలో వున్న జాతీయ కామధేను బ్రీడింగ్ సెంటర్‌కు తరలించారు. చింతలదీవిలో పిండోత్పత్తి, పిండ మార్పిడి నిర్వహిస్తుంటారు. సాధారణంగా పాడిపశువు తన జీవిత కాలంలో 8 దూడల వరకు జన్మనిస్తుంది. నెల్లూరు జిల్లా చింతలదీవిలో ఏర్పాటు చేసిన జాతీయ కామధేను కేంద్రంలో పిండోత్పత్తి విధానం ద్వారా ఒక్క పశువు నుంచి అధిక సంఖ్యలో దూడలను ఉత్పత్తి చేయవచ్చు. మండపేట పరిసరాల్లో స్థానిక పశువైద్యుల సహకారంతో చింతలదీవి నుంచి వచ్చిన దేవరాజు, స్థానిక కేంద్రీయ పశు నమోదు ప్రతినిధి డి.రాజేశ్వరరావు రైతుల వద్దకు వెళ్లారు. మండపేటకు చెందిన నిమ్మలపూడి వీర్రాజు చౌదరి(నల్లబ్బు) నిమ్మలపూడి సత్యనారాయణ(సత్తిబాబు), వేగుళ్ల ఓంతేజ వద్ద వున్న మేలురకం, గేదెలను రూ.4.65 లక్షలకు కొనుగోలు చేసి చింతలదీవికి పంపించామని కేంద్రీయ పశునమోదు ప్రతినిధి రాజేశ్వరరావు తెలిపారు. రెండు గేదెలు రూ.3.5 లక్షలు కాగా, పెయ్యి దూడ రూ.లక్షా పదిహేను వేలు వంతున కొనుగోలు చేశామన్నారు. వాటిని శుక్రవారం చింతలదీవికి తరలించామన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

కపిలేశ్వరపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అంగరలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాతకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవాన్ని జరిపారు. ఆర్యవైశ్యులు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.





పసలపూడిలో భావనారుషి విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు. పక్క చిత్రంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న దృశ్యం

పసలపూడిలో భావనారుషి విగ్రహ ప్రతిష్ఠ

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి శివారు గోపడు తోటలో భద్రావతి సమేత భావనారుషి విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం ఘనంగా జరిపారు. పద్మశాలి సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఖానస పండితుడు పెదపూడి రాముదాం ఆధ్వర్యంలో విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, హోమం, యంత్ర ప్రతిష్ఠ తదితర పూజలు జరిపారు. ఉదయం 10.02 గంటలకు స్వామి, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిపారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు: భావనారుషి విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఆలయ కమిటీ, కూటమి నాయకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఎమ్మెల్యే హోమశాల వద్ద పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ కర్రి వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకన్నబాబు, నల్లమిల్లి సతీష్‌రెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి, నల్లమిల్లి అమ్మిరెడ్డి, మల్లిడి అమ్మిరెడ్డి, నూలు ఆదినారాయణ, బుంగ పెద్ద, సత్తి వెంకటరెడ్డి(ఎస్‌వీ) తదితరులు ఉన్నారు.

వాసవీమాతకు పట్టువస్త్రాలు అందజేత

మండపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు అందించారు. ద్వారపూడిలో వున్న వాసవీమాత అమ్మవారికి ఆయన స్వయంగా పట్టుబట్టలను అందించారు. ముందుగా ఆలయ నిర్వాహకులు, వాసవీ క్లబ్ సభ్యులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారికి జరిగిన పూజల్లో పాల్గొన్నారు. మండపేటలో జరిగిన కార్యక్రమంలో కోటి వాసవీ నామావళి పుస్తకాన్ని వైశ్య నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, 17వ వార్డు కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్య భవాని, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, కొనగళ్ల సత్తిపండు, టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, సత్తి సత్యనారాయణ, చింతా దొరబాబు, పల్లా బాబు, చేకూరి రమేష్‌రాజు, లక్ష్మీవీరభద్రరావు, కె.మురళీకృష్ణ, టి.చంద్ర శేఖర్, కె.గోవిందు తదితరులు పాల్గొన్నారు.



వాసవీ కన్యకా పరమేశ్వరిమాతకు పట్టుబట్టలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల



పంచాయతీరాజ్ డీఈఈ రామనారాయణ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఉత్తమ సేవలే గుర్తింపునిస్తాయి

ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాయవరం వీఎస్ఎం కల్యాణ మండపంలో పంచాయతీ రాజ్ ఇన్‌ఛార్జ్ డీఈఈగా పనిచేస్తూ పదవి విరమణ పొందిన వి.రామనారాయణ దంపతులను సన్మానం కార్యక్రమం నిర్వహించారు. 33 సంవత్సరాలు పాటు పీఆర్ డిపార్ట్‌మెంట్‌లో అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారుల చేతులమీదుగా ఘనంగా పూలమాలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, సర్పంచ్‌లు చంద్రమళ్ల రామకృష్ణ, చింతపల్లి శ్రీనివాసరావు, గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉండవిల్లి రాంబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన, తహశీల్దారు ఐవీ శెట్టి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్యకుమారి, కపిలేశ్వరపురం, మండపేట మండలాల ఇంజనీరింగ్ అధికార్లు జీవీ రాఘవులు, నాగేశ్వరరావు, కొత్తపేట డీఈఈ సూర్యనారాయణ, ఎంఈవో వై.సూర్యనారాయణ, కపిలేశ్వరపురం ఎంపీపీ సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.



అర్తమూరులో విద్యార్థులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ దొర్రాజు

విద్యార్థులకు పోలీసుల అవగాహన

మండపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో పోటీపడి లక్ష్యాలు చేరుకోవాలే తప్ప, చెడు వ్యసనాల బారిన పడవద్దని మండపేట పట్టణ, రూరల్ సీఐలు పి.దొర్రాజు, డి.సురేష్ పిలుపునిచ్చారు. మండపేటలోని సెయింట్ ఆన్స్, అర్తమూరు సత్య భాస్కర జిల్లా పరిషత్ హైస్కూల్, మండపేటలోని సెయింట్ ఆన్స్ పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు సోషల్ మీడియా, సైబర్ నేరాల జోలికి వెళ్లవద్దని తెలిపారు. కార్యక్రమంలో మండపేట రూరల్ సీఐ దొర్రాజు, పట్టణ సీఐ సురేష్, రూరల్ ఎస్ఐ బుజ్జిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పి.సుబ్బారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజును పురస్కరించుకుని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పట్టువస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకుడు నంబూరి రెడ్డియ్య, ధర్నాల రామకృష్ణ, బూసి జయలక్ష్మి, విశ్వ మారుతీప్రసాద్, యల్లమల్లి జగన్మోహన్, గుబ్బల మూర్తి, తమ్మన సాయిప్రసాద్, శ్రీకాకుళపు బంగారం, శ్రీకాకుళపు బాబి, గమిడి ఆనంద్, యెండూరి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ప్రత్యేక అలంకరణలో ఉన్న సరస్వతి అమ్మవారు

వైభవంగా సరస్వతి పూజలు

ఆత్రేయపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వసంత పంచమి పురస్కరించుకుని ర్యాలీ అన్నపూర్ణాదేవి ఆలయం వద్ద ఆదివారం ఉదయం 8 గంటలకు సామూహిక సరస్వతి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకురాలు అన్నపూర్ణాదేవి పేర్కొన్నారు. ఉచితంగా పూజా సామగ్రిని అందిస్తున్నామని చిన్నారులు సరస్వతి పూజలో పాల్గొనాలన్నారు.

నిత్యాన్న దానానికి రూ.1.02 లక్షల విరాళం

మామిడికుదురు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఏరువ కేశవరెడ్డి-లక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1.2లక్షలు విరాళంగా అందించారు. దాతలకు అర్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించగా స్వామివారి చిత్రపటాన్ని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు అందించి అభినందించారు. శుక్రవారం స్వామివారిని 1400మంది దర్శించుకుని 650మంది నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,38,578 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ తెలిపారు.



అచ్యుతాపురంలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

'చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి'

కపిలేశ్వరపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురంలో ఎమ్మార్పీఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 7న జరిగే ఛలో హైదరాబాద్ ప్రోగ్రాం కమిటీ కన్వీనర్ పలివెల లాజర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించిన మందకృష్ణమాదిగకు అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 7న నిర్వహించే వెయ్యి గొంతుకలు... లక్షడప్పులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పిప్పర సంపతరావు, చిర్రా కొండబాబు తెలిపారు. సమావేశంలో ఉద్యోగ సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు పలివెల సుబ్బారావు, పలివెల జేజిబాబు, యార్లగడ్డ అశోక్, తాతపూడి వంశీ, రాజేష్‌శర్మ, వీర్రాజు, విజయ్‌కుమార్, ఇశాక్, పెందుర్తి తేజ, లంక జాన్, కె.సత్యనారాయణ, వేమగిరి శ్రీను, కె.దీవీదు, ఏసు, ఆశీర్వాదం, ఎం. రాజు, ఎన్.వెంకన్నబాబు, కె.సత్యనారాయణ, దావీదు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

ద్రాక్షారామ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విద్యా రంగానికి నిధులు పెంచి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని వక్తలన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ, అఖిల భారత విద్యా హక్కుల వేదిక పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాలు ఈ మేరకు డిమాండ్ చేశాయి. శుక్రవారం జరిగిన సమావేశంలో సిద్ధూ మాట్లాడారు. దేశంలో విద్యా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. దేశవ్యాప్తంగా పది సంవత్సరాల్లో లక్ష ప్రభుత్వ పాఠశాలలను రద్దు చేశాయని ఆరోపించారు. రాష్ట్రంలో 4,500 పాఠశాలలు రద్దయ్యాయన్నారు. ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి వి. భీమశంకరం, పీవైఎల్ నాయకుడు అంబటి కృష్ణ, చింతా రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధూ